

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.



# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 22 • పేజీలు : 8 • మంగళవారం 22 అక్టోబరు 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada | Visakhapatnam | Srikakulam | Rajahmundry | Kurnool | Guntur | Ongole | Nellore Tirupati


## డయేరియా బాధితులను ఆదుకుంటాం

◆ డయేరియా..మృతుల కుటుంబాలకు పవన్ ఆర్థికసాయం

◆ ఎస్.ఎస్.ఆర్.పేట వద్ద గుర్ల తాగునీరు పరిశీలన

◆ విచారణ తర్వాత ప్రభుత్వం నుంచి పరిహారం..

◆ వ్యక్తిగతంగా మృతుల కుటుంబాలకు రూ. 1లక్ష ఆర్థిక సాయం

◆ గత ప్రభుత్వ తప్పిదాలు మాకు వారసత్వంగా వచ్చాయి..

◆ విచారణకు సీనియర్ ఐఏఎస్ విజయానంద్‌ను నియామకం

◆ కనీసం మంచినీరు అందించలేకపోయిన గత ప్రభుత్వం..



గుర్ల,అక్టోబరు 21 (ఆంధ్రపత్రిక): విజయనగరం జిల్లాలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటించారు. నెల్లిమర్ల మండలం ఎస్.ఎస్.ఆర్.పేట వద్ద గుర్ల తాగునీటి పథకాన్ని ఆయన పరిశీలించారు. గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించారు. ఆ గ్రామస్థులతో ముఖాముఖి మాట్లాడారు. అతిసారం మిగతా 7లో

◆ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల కీలక పాత్ర

◆ ప్రజల మాన, ప్రాణ, ఆస్తులకు రక్షణగా నిలుస్తున్నారు..

◆ విధి నిర్వహణలో ఎంతోమంది ప్రాణాలు విడిచారు...

◆ అమరావతితో శాశ్వత స్మారక స్థూపం ఏర్పాటు..

◆ దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిది

◆ ప్రజలు ప్రశాంతంగా ఉంటున్నారంటే పోలీసులే కారణం

◆ రాష్ట్ర అభివృద్ధిలోనూ పోలీసులదే కీలక బాధ్యత

◆ శాంతిభద్రతలతోనే రాష్ట్రానికి పెట్టుబడి అవకాశాలు

◆ అమరులైన పోలీస్ కుటుంబాలను ఆదుకుంటాం

◆ పోలీసుల సంక్షేమం మా ప్రభుత్వం బాధ్యత



## పోలీసుల త్యాగాలు ఎనలేనివి

### పోలీస్ అమరులకు నివాళి అర్పించిన సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి,అక్టోబరు 21 (ఆంధ్రపత్రిక): శాంతి భద్రతల పరిరక్షణకు ఏపీ పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని, ప్రజల మాన, ప్రాణ, ఆస్తులకు రక్షణగా నిలుస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీ పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం విజయవాడలో అమరవీరుల స్థూపానికి సీఎం చంద్రబాబు ఘన నివాళులు అర్పించారు. ముందుగా ముఖ్యమంత్రితోపాటు హోం మంత్రి వంగలపూడి మిగతా 7లో

## గ్రూప్-1 పరీక్షల్లో జోక్యం చేసుకోలేం..

- మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ

- యధాతథంగా గ్రూప్ పరీక్షల నిర్వహణ..



న్యూఢిల్లీ,అక్టోబరు 21 : తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు, మధ్యంతర ఉత్తర్వులు మిగతా 7లో

## ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించవద్దు

ఖలిస్తాన్ ఉగ్రవాది పన్నూ హెచ్చరికలు



న్యూఢిల్లీ,అక్టోబరు 21 : దేశంలో గత కొన్ని రోజులుగా విమానాలకు వరుసగా బాంబు బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాల వేళ ఖలిస్థానీ వేర్పాటువాది గుర్‌పత్వంత్ సింగ్ పన్నూ 'ఎయిర్ ఇండియా'కు హెచ్చరికలు చేయడం తీవ్ర కలకలం రేపింది. నవంబరు 1 నుంచి 19వ మిగతా 7లో

## కెనడా తీరుపై అసహనం

- మనదేశంలో ఓ మాదిరిగా..వారి దేశంలో మరోమాదిరి

- అందుకే దౌత్యవేత్తలను కెనడా నుంచి రప్పించాం..

- భారత విదేశాంగ మంత్రి జైశంకర్



7లో

## నంద్యాల పిటిషన్ కొట్టివేయండి



7లో

- ఎపి హైకోర్టులో అల్లుఅర్జున్ పిటిషన్ - నేను ఎన్నికల ప్రచారం కోసం వెళ్లలేదు - తన స్నేహితుడ్ని కలవడానికి మాత్రమే వెళ్లా...

## ప్రపంచానికి ఆశాకిరణంగా భారత్





- ఆర్థిక ఇబ్బందుల్లో సమర్థ పనితీరు

- 'ది ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్'లో మోదీ

న్యూఢిల్లీ,అక్టోబరు 21 : ప్రపంచం మొత్తం కొవిడ్, యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో ఇబ్బంది పడుతున్న వేళ కూడా మన

## పొరుగు రాష్ట్రాలకు ఇసుకను తరలించకుండా చర్యలు

- ఆ మూడు రాష్ట్రాలకు ఇసుక వెళ్లిపోతోంది...

- ఉచిత ఇసుకపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

- ఆయా మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు..పటిష్ఠ పర్యవేక్షణ ఉండాలి



అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రపత్రిక): రాష్ట్రంలోని ఇసుకను పొరుగు రాష్ట్రాలకు తరలించకుండా చర్యలు తీసుకోవాలని ఏపీ ముఖ్య మంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమ లు చేసేందుకు, లభ్యత మిగతా 7లో

## విమానయాన భద్రతే ముఖ్యం..



- విమానయాన భద్రతలో ప్రభుత్వం రాజీపడదు

- బెదిరింపు కాల్స్ చేస్తే వారికి జీవిత ఖైదు..

-కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడి

7లో

## అసెంబ్లీ సమావేశాలకు రండి..



◆ అసెంబ్లీ సమావేశాలకు జగన్‌ను ఆహ్వానిస్తున్నా..

◆ అసెంబ్లీ సమావేశాల్లో ఇద్దరం కలిసి ముచ్చటించుకుందాం

◆ ఎపి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రపత్రిక): ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నేడు అనకాపల్లి జిల్లాలో 'పల్లెపండుగ' మిగతా 7లో

## తిరుమల ఆలయ పరిసరాల్లో హెలికాప్టర్ చక్కర్లు





◆ హెలికాప్టర్ చక్కర్లు కొట్టడంపై భక్తులు ఆగ్రహం

◆ తిరుమలను నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాలి?

◆ దీనిపై టిటిడి యంత్రాగం ఏ విధంగా స్పందిస్తుందో..

◆ విమానాలు తిరగడం ఆగమశాస్త్ర సాంప్రదాయానికి విరుద్ధం

తిరుమల,అక్టోబరు 21 (ఆంధ్రపత్రిక): పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల శ్రీవారి ఆలయం పరిసర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10:30 గంటలకు హెలికాప్టర్ చక్కర్లు కొడుతూ కనిపించింది. శ్రీవారి ఆలయంపై విమానాలు తిరగడం ఆగమ శాస్త్ర సాంప్రదాయానికి మిగతా 7లో



## వైఎస్ఆర్ ఆశయాలు గుర్తులేవా..

◆ మోదీకి అసలుసిసలు వారసుడు జగన్

◆ అందుకే చెట్టపట్టాలేసుకుని తిరిగాడు..

◆ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని జగన్ నీరుగార్చారు..

◆ మీడియా సమావేశంలో షర్మిల ఘాటు విమర్శలు

విజయవాడ,అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక): మోదీకి అసలుసిసలు వారసుడు జగన్ అని, అందుకే చెట్టపట్టాలేసుకుని తిరిగాడని మిగతా 7లో

## దూసుకొస్తున్న 'డానా' తుఫాన్..!



◆ ఎపి సహా పలు రాష్ట్రాలకు అతి భారీ వర్ష సూచన

◆ ఈనెల 23న తుఫాన్ తీరం దాటనున్న 'డానా' తుఫాన్

◆ పలు రాష్ట్రాలకు కేంద్ర వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ

◆ 23-25 తేదిల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం...

◆ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపిన అధికారులు

అమరావతి,అక్టోబరు 21 (ఆంధ్రపత్రిక): బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుఫాన్ తీరం వైపు దూసుకొస్తోంది. ఈనెల 23న తుఫాన్ తీరం దాటనుంది. దీంతో దేశంలోని పలు రాష్ట్రాలకు కేంద్ర వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. 23-25న అతి భారీ మిగతా 7లో

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్

# ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# ఆనందమే అందం!

"అందమే ఆనందం.. ఆనందమే జీవిత మకరందం.. "అని ఎప్పుడో 70 ఏళ్ళ క్రితంసముద్రాల రామానుజాచార్య ఓ పాట రాశారు.ఆ గీతాన్ని అద్భుతంగా స్వరపరిచి, ఆలపించారు ఘంటసాల.ఇది 1973లో వచ్చిన'బతుకుతెరువు' సినిమాలోనిది.పాట చివర్లో "జీవితమే ఒక నాటక రంగం" అంటారు.నాటకం వంటి జీవితంలో ప్రతి మనిషికి ఏదో రోజు తెరపడుతుంది.అది తప్పదు. పుట్టినప్పటి నుంచి పోయేంత వరకూ సాగే బతుకు నడుమ ఆనందాన్ని పోగుచేసుకొని అనుభవిస్తేనే ఆనందం. లేకపోతే,అంతా అయోమయం, విషాదం.ఈ జీవనసారాన్ని మన మహర్షులు,మహర్షుల వంటి మహాకవులు, మహనీయులు, మాననీయ మూర్తులు తెలుసుకున్నారు, మనసారా అనుభవించారు, ఆచరించండనిమనకు అనేక రూపాల్లో,మార్గాల్లో చెప్పారు. మనుషులంతా సంతోషంగా ఉండండి,అది అందరికీ పంచండి, అది ఎక్కడుందో వెతికి పట్టుకోండి, పట్టుకొని వదలకండి... అంటూ ఐక్యరాజ్య సమితి అంటోంది. సుమారు ఓ పుష్కరం క్రితం (2013) తొలిసారిగా,సమితిలోని సభ్యదేశాలన్నీ ఈ వేడుకను జరుపుకున్నాయి.అప్పటి నుంచి ప్రతి ఏడూ జరుపుకుంటున్నాయి. కానీ,అందరికీ ఈ ఉత్సవం గురించి పెద్దగా అవగాహన లేదు. ఆ స్థాయిలో ప్రచారం జరుగలేదు.అంతర్జాతీయ ఆనంద దినోత్సవం సందర్భంగా ప్రతి ఏడూ కొన్ని నివేదికలు అందుతూ వుంటాయి. ఏ ఏ దేశాలలో సంతోష,ఆనందాల స్థాయి ఎట్లా వుందని కొలుస్తారు. ఆ కొలతలకు కొన్ని నియమాలు పెట్టుకున్నారు.ఈ నియమాల ప్రకారం నివేదిక ద్వారా మనకు అర్థమవుతున్నదేంటంటే?మనదేశం 126 వ స్థానంలో వుంది.మనకంటే ఎంతో పేద దేశాలు ముందు వరుసలో వున్నాయి.మన పొరుగు దేశాలైన చైనా, నేపాల్,పాకిస్తాన్,మయన్మార్మనకంటే ఆనందంగా వున్నాయి.మొత్తం దేశాలలో ఫిన్ ల్యాండ్ అందరికంటే ఆనందమైన దేశంగామొదటి స్థానంలో నిలిచింది.దాదాపు ఏడేళ్ల నుంచి ఫిన్ ల్యాండ్తన అగ్రతను కాపాడుకుంటూ వస్తోంది.60 వ ర్యాంక్ తో మనకంటే చైనా చాలా ఆనందంగా ఉన్నట్లు ఈ నివేదిక చెబుతోంది.క్షేత్రస్థాయిలో,నిజజీవితంలో వాస్తవాలు మనకు పూర్తిగా తెలియదు కానీ,ఐక్యరాజ్య సమితిఆమోదం తెలిపిన సంస్థ చెప్పే నివేదికలో మాత్రం విషయాలు అలాగే వున్నాయి.ప్రపంచమానవాళికి శాంతిని,ఆనందమయ జీవితాన్ని చాటి చెప్పామని చెప్పుకుంటున్నమన దేశం ఈ సూచీలో వెనుకబడి పోవడం వివిధ ఆలోచనలను రేకెత్తిస్తోంది.అంతర్ముఖంగా మళ్ళీ అలోచించుకోవాల్సిన ఆవశ్యకతనుగుర్తు చేస్తోంది.ఏది ఆలోచిస్తే, ఏది చేస్తే,ఏది చూస్తే ఆనందం కలుగుతుందో? అవన్నీ మన మహర్షులు మనకు ఎన్నడో చెప్పేశారు.భగవద్గీత నుంచి సంగీతం వరకూ,ధ్యానం నుంచియోగాభ్యాసం వరకూ,మౌనం నుంచి ఆధ్యాత్మిక సాధన వరకూ,శాంతి నుంచి స్థితప్రజ్ఞత వరకూ మనకు బోధించారు.వాటిని కొందరు ఆచరించారు,కొందరు ఆచరించే ప్రయత్నం చేస్తూనే వున్నారు. కొందరు ఇవ్వేమీ తెలియకుండానే సహజంగా ప్రవర్తిస్తూ వస్తున్నారు.మొత్తంగా చూస్తే ఎక్కువమంది ఆనందంగా లేరు.అసంతృప్తితో అలమటిస్తున్నారు, అయోమయంలో వున్నారు.ఐక్యరాజ్య సమితి పెట్టిన నియమాలను ఒకసారి వీక్షిద్దాం.ఆత్మతృప్తి,జీవనకాలం (లైఫ్ స్పాన్),సామాజిక మద్దతు,తలసరి ఆదాయం,దాతృత్వం,స్వేచ్ఛ,అవినీతి మొదలైన వాటిల్లోఆ యా దేశాలు,ఆ యా దేశ ప్రజలు ఎలా వున్నారన్నది ప్రాతిపదికగాదేశాలకు ర్యాంకులను కేటాయించారు.అగ్రరాజ్యం అమెరికా,జర్మనీ వంటి దేశాలలో కూడా సంతోషం సన్నగిల్లు తోందని ఈ నివేదిక చెబుతోంది. ఒక్కమాటలో చెప్పాలంటే చిన్నదేశాలే పెద్ద ఆనందంగా వున్నాయి." చిన్న కుటుంబం – చింతలులేని కుటుంబం " అన్న పాత సామెత గుర్తుకువస్తోంది.అనందాన్ని అనుభవించేవారి వయసుల్లోనూ ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క తీరు నడుస్తోంది.పెద్ద వయస్సు వారికంటే చిన్నవాళ్లే ఆనందంగా ఉన్నారని నివేదికలు చెబుతున్నా,అన్నిచోట్లా అట్లా లేదు.ఉత్తర అమెరికా,ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్ వంటి దేశాల్లో యువత కంటే పెద్దలే ఎక్కువ ఆనందంగా వున్నారు.ఐరోపా వాసుల్లో ఆనందం కాస్త పెరుగుతున్నట్లు,పశ్చిమ యూరప్ లో అందరూ సమానమైన సంతోషకర వాతావరణంలో వున్నారని తెలుస్తోంది.ఒక్క ఐరోపా దేశాల్లో తప్ప మిగిలిన అన్ని దేశాలలోనూ ఆనందంలో అసమానతలు పెరిగిపోతూ ఉండడం బాధాకరం.అందులో మనదేశం కూడా వుండడం ఇంకా బాధాకరం.అందరి కంటే అత్యంత ఆనందంగా వున్న ఫిన్ ల్యాండ్ ప్రజలను గమనిస్తే వారి లక్షణాలు, ఆలోచనలు ఆనందాన్ని కలిగిస్తున్నాయి,స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.ప్రకృతితో ఎక్కువ మమేకమై ఉండడం,వృత్తిని – జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ,సమతుల్యత పాటిస్తూ సాగడం,విజయంపై స్పష్టమైన అవగాహన కలిగివుండడం,అవినీతి తక్కువగా ఉండడం,ప్రభుత్వాల పట్ల ఎక్కువ విశ్వాసం కలిగి వుండడం,ఆరోగ్యం,విద్య,సంరక్షణలో ప్రభుత్వం సక్రమంగా పరిపాలన,సేవలు అందించడం మొదలైనవి ఫిన్ల్యాండ్ వారి ఆనందమయ జీవితానికి కారకాలుగా,ప్రేరకాలుగా కనిపిస్తున్నాయి.'అంతర్జాతీయ ఆనంద దినోత్సవం' లో ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క ఎజెండా పెట్టుకుంటున్నాం. "అనందానికి తిరిగి దగ్గర కావడం – స్థితప్రజ్ఞత కలిగే,పెరిగే సమాజాలు నిర్మించుకోవడం " ఈ 2024 సంవత్సరానికి పెట్టుకున్నాం.ఇది సాధించడం పెద్ద కష్టమైన విషయం కాదు.ఆనందం ఎక్కడో లేదు,మనలోనే వుంది.మన ఆలోచనలలో వుంది,మన ఆచరణలో,నడవడికలో వుంది.రమణమహర్షి నుంచి రామానుజాచార్యులు ( సముద్రాల ) వరకూ, మహాత్మాగాంధీ నుంచి మార్క్ ట్వైన్ వరకూ,ఆదిశంకరాచార్యుల నుంచి అబ్రహం లింకన్ వరకూ, లియో టాల్ స్టాయ్ నుంచి జాన్ కీట్స్ వరకూ చెప్పింది ఒక్కటే! "ఆనందంగా ఉండండి, తోటివారినిఅనందంగా ఉంచండి ".ఈ క్రమంలో మనకు బోలెడు సారస్వతం వుంది,కళలు వున్నాయి,భగవద్గీత,మహాభారత రామాయణాది కావ్యాలు, ఇతిహాసాలు, వేదవేదాంగాలుఅందించిన జ్ఞానభాండాగారం మన దేశానికి మెండుగా అండగా వుంది.పొద్దున నిద్ర లేచినప్పటి నుంచి నిద్రలోకి జారుకొనేంత వరకూ ఏమేమి చెయ్యాలో,ఏమేమి చెయ్యకూడదో ఆచార్యులు, శాస్త్రవేత్తలు,డాక్టర్లు చెబుతూనే వున్నారు.ఆహారం,నిద్ర, వ్యాయామ నియమాలు, శాంతి,విశ్రాంతిని ఆచరించడం మన చేతుల్లోనే వుంది. ప్రతి మనిషి కోరుకొనేది ఒక్కటే...ప్రతి క్షణం ఆనందంగా ఉండడం.అదే జీవితమకరందం.ఈ ఆనంద సూచీలో మనంఫిన్ ల్యాండ్ను దాటి మొదటి స్థాయినిఅందుకోవాలి.అందరూఅనందంగా ఉండాలని అనుకుందాం.

# పనిపై ధ్యాస ప్రగతికి బాట

పని చేసేటప్పుడు పనిమీదే ధ్యాసపెట్టాలి శరీరాన్ని మనసును ప్రస్తుత క్షణంలో లగ్నం చేయాలి గతాన్ని తలవకు వర్ధమానంలో జీవించు భవిష్యత్తు గురించి బెంగ వద్దు కంగారును వదులుకో కుంగుబాటుతో కుదేలు కాకు లక్ష్య సాధనలో నిరంతర కృషితో వ్యక్తిగత లక్ష్యాలు చేరువవుతాయి జీవితంలో సమన్వయం సంఘీభావం సహనం సౌహార్ధతజినీ జీవనశైలి కావాలి. పట్టుదలే పెట్టుబడి కావాలి. పనిచేసేటపుడు పనిపైన ధ్యాస ప్రగతికి బాట మనిషి ఒక చోట మనసు ఒక చోట ఆందోళనకు గురై అభివృద్ధికి దూరమై సమస్యల వలయంలో చిక్కుకుపోయి చికాకు చెందకు పని చేసేటపుడు పనిపై ధ్యాసను సడలించకు విశ్రాంతి గురించి ఆలోచించకు కుటుంబ సభ్యులతో స్నేహితులతో గడుపుతున్నప్పుడు పని గురించి ఆలోచించకు అప్పుడుమాత్రమే కుటుంభంతో స్నేహితులతో గడిపిన ఆనందాన్ని సంతోషాన్ని ఆస్వాదిస్తావు ఆలోచన ధోరణిమార్చుకో అభివృద్ధికి సారథివై సాగిపో....

నేదునూరి కనకయ్య

# ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు

## అక్టోబర్ 22... కొమురం భీం జయంతి సందర్భంగా





ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీకి వ్యతిరేకంగా, పాలక వర్గాల దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ, గిరిజన హక్కుల కోసం 'జల్-జంగిల్-జమీన్' నినాదంతో మడమ తిప్పని పోరాటాలు చేసి, ప్రాణాలర్పించిన పోరాట యోధుడు కొమురం భీం. గిరిజన గోండు తెగకు చెందిన కొమురం చిన్నూమ్, సోంబాయి దంపతులకు 1901 అక్టోబర్ 22న అవిభక్త ఆదిలాబాద్ జిల్లా, ఆసిఫాబాద్ తాలూకాలోని సంకేపల్లి గ్రామంలో జన్మించి, ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు, జోడేఘాట్ గుట్టలు కేంద్రంగా నిజాం నవాబు పై గెరిల్లా పోరాటాన్ని కొనసాగించి, కుర్దు పటేల్ అనే నమ్మకద్రోహి ఇచ్చిన సమాచారంతో, అర్ధరాత్రి కొమరం స్థావరాలను సైన్యం చుట్టుముట్టగా జోడేఘాట్ అడవుల్లో 1940, అక్టోబర్ 27 న, అంటే ఆదివాసీలు పవిత్రంగా భావించే ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి రోజున వీరమరణం పొందాడు భీం.కొమురం భీం స్ఫూర్తితో...దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్‌లు,తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు.

జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడుతుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు. నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టూ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు, తరతరాలుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది. ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జారండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు.మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నా రు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచు కోని గిరిపల్లెలు నేటి ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో కేసిఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించింది కూడా. పోడు భూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నది. అలా గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యం. అత్యవసరం.

రామ కిష్టయ్య సంగన భట్ల

# నత్తి జబ్బు కాదు... ఇబ్బంది మాత్రమే

నత్తి అనగా అసంకల్పిత పునరుక్తుల ద్వారా ప్రసంగ ప్రవాహమునకు విఘాతం కలిగించే ప్రసంగ లోపం. దీనిలో శబ్దాలు, పదాంశాలు, పదాలు లేదా పదబంధాల యొక్క పొడిగింపు అలాగే అసంకల్పిత నిశ్శబ్ద అంతరాయాలు లేదా నిరోధాలు ఉంటాయి, అందువలన నత్తి ఉన్న వ్యక్తి ధ్వనులను స్పష్టంగా పలకడం సాధ్యం కాదు. ఎవరైనా మాట్లాడే టప్పుడు మాటలు తడబడటం లేదా ముద్ద ముద్దగా మాట్లాడటం, కొన్ని అక్షరాలు సరిగా పలక లేకపోవడం జరుగు తుంటుంది. ఈ విధంగా తరచుగా జరుగు తున్నట్లయితే వారికి నత్తి ఉందని అర్థం. ప్రపంచ నత్తి నివారణ అవగాహనా దినోత్సవమును ప్రతి సంవత్సరం అక్టోబరు 22న జరుపు కుంటారు. 1998, అక్టోబరు 22న 'ఇంటర్నేషనల్ ఫ్లూయెన్సీ అసోసియేషన్', 'ఇంటర్నేషనల్ స్టట్టెరింగ్ అసోసియేషన్', యూరోపియన్ లీగ్ ఆఫ్ స్టట్టెరింగ్ అసోసియేషన్' సంస్థలు సమావేశమై నత్తిపై ప్రజలకు అవగాహన కలిగించటం ద్వారా దానిని నివారించవచ్చని ఒక నిర్ధరణకు వచ్చాయి. అంతే కాకుండా ప్రతి సంవత్సరం అక్టోబరు 22న అంతర్జాతీయ నత్తి నివారణ అవగాహనా దినోత్సవం నిర్వహించాలని పిలుపు నిచ్చాయి. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం పలు దేశాలు, సంస్థలు "నత్తి" నివారణ పట్ల అవగాహనా కార్య క్రమాలు నిర్వహిస్తున్నాయి. మనం మాట్లాడేటప్పుడు అక్షరాలు ఒక దాని తరువాత మరోటి నిర్దిష్ట సమయంలో ఉచ్చరించడం వలన ఇతరులకు ఆ ధ్వనులు స్పష్టంగా వినిపిస్తాయి. ఊపిరితిత్తుల నుండి బయటకు వచ్చేగాలి, స్వరపేటిక లోని స్వరతంత్రుల ప్రకంపనలతో స్వరంగా మారి బయటకు వచ్చే టప్పుడు నాలుక పలు విధాలుగా కదిలించడం వలన అనేక శబ్దాలు ఉచ్చరించ గలుగుతాము. ఈ ప్రక్రియ మొత్తం మెదడు పర్య వేక్షణలో అతి వేగంగా జరుగుతూ కొన్ని సెకండ్ల వ్యవధిలోనే పూర్తవు తుంటుంది. అయితే ఈ ప్రక్రియలో ఒక్కోసారి కొన్ని అసమానతలు తలెత్తి స్వరతంత్రులు సరైన సమయానికి తెరచుకోక పోవడం, నాలుక నిర్దిష్ట సమయంలో కదలక పోవడం లేదా నాలుక ఒకే చోట ఎక్కువ సేపు ఉండిపోవడం వలన శబ్దాలు, పదాలు, వాక్యాలు ఆగి ఆగి రావడం లేదా అవే ధ్వనులు మళ్ళీ మళ్ళీ రావడం జరుగుతుంది. పుట్టుకతో వినికి డి సమస్య ఉన్న వారికి మాటలు నత్తిగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. కొంత మందిలో భయం, టెన్షన్, ఇతరులను అనుకరించడం వల్ల, వంశపారంపర్యంగా నత్తి వస్తుంది. కొందరిలో ఒక అక్షరం బదులు ఇంకొక అక్షరం పలుకు తుంటుంది. వీటిని స్పీచ్ థెరపీతో నయం చేయవచ్చు. నేటి రోజుల్లో చిన్న పిల్లలు నత్తినత్తిగా మాట్లాడటం ఒక సాధారణ సమస్యగా మారింది. ముఖ్యంగా ఈ సమస్య 2సంవ త్సరాల నుండి 5ఏళ్ళ మధ్య ఉంటుంది. చిన్న పిల్లలు నత్తి నత్తిగా మాట్లాడటాన్ని ఇంగ్లిష్‌లో స్టామరింగ్ లేదా స్టట్టరింగ్ అంటారు. ఒక పదాన్ని ఉచ్చరించే సమయంలో తొలి అక్షరాన్ని పదే పదే పలుకుతూ ఉండటం, లేదా ఆ పదాన్ని గబుక్కున ఉచ్చరించలేక అదే మాటను మళ్లీ మళ్లీ అంటుం డటం, ఒక్కోసారి మాట ఆగిపోయి ఒక పట్టాన గొంతు పెగిలి బయటకు రాకుండా ఉండటం... ఇవన్నీ స్టామరింగ్ లేదా స్టట్టరింగ్‌లో భాగమే. స్టామరింగ్ అన్నది చాలా సాధారణ సమస్య. నత్తికి చాలా కారణాలు ఉన్నాయి. జన్యుపర మైన, న్యూరో ఫిజియలాజికల్ మార్పుల వల్ల ఒక్కోసారి నత్తి రావచ్చు. నత్తి ఉన్న పిల్లల్లో కొందరికి వినికిడి సమస్య కూడా ఉండవచ్చు. కాబట్టి పై సమస్యలు ఉన్నాయా లేదా అని పరీక్షించడం చాలా ముఖ్యం. పిల్లల మానసిక స్థితిని సరిగ్గా అర్థం చేసుకోకుండా వారిని ఇతరులతో పోల్చిచూడటం, వాళ్లపై ఒత్తిడి పెంచడం వంటి కారణాలతో స్టామరింగ్ ఇంకా ఎక్కువ కావచ్చు. మాటలు నేర్చుకునే వయసు పిల్లల్లో స్టామరింగ్ అన్నది చాలా సాధారణంగా కనిపించే సమస్య. అయితే వాళ్లలో వయసు పెరుగుతున్న కొద్దీ సమస్య తగ్గుతూ ఉంటుంది. పిల్లల్లో ఒకవేళ స్టామరింగ్ ఉంటే... ఐదేళ్లు వచ్చేనాటికి 65 శాతం మంది పిల్లల్లో, యుక్తవయసు వచ్చేదానికి ముందుగా 75 శాతం మందిలో ఈ సమస్య తగ్గిపోతుంది. నత్తి బాలికలంటే బాలురలో నాలుగు రెట్లు అధికంగా ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. 15 మిలియన్ల మందికి నత్తి ఉంటే అందులో అధికంగా పిల్లలే ఉన్నారని అంచనా. రెండు నుంచి ఏడు సంవత్సరాల వయస్సు గల పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. కొందరిలో అకస్మికంగా నత్తి మాటలు వస్తాయి. కొంతకాలం కొనసాగుతాయి. నత్తిగా మాట్లాడే వారిని ఎగతాళి చేయకూడదు. ఇతరులు ఎగతాళి చేసిన కొద్దీ వారి సమస్య మరింత పెరగగలదు. నత్తి అనేది రోగం కాదు, వీరిలో శారీరకంగా ఎటువంటి సమస్యలూ ఉండవు. అందువలన మందులు శస్త్ర చికిత్సల వలన ఇది నయం కాదు, కాని




వారిలో మానసిక ఒత్తిడిని, భయాన్ని తగ్గించే ప్రత్యేక చికిత్సా విధానం ద్వారా నత్తిని నయం చేయవచ్చు. ఈ ప్రత్యేక చికిత్సా విధానంలో మాట్లాడే క్రమంలో స్వరతంత్రులు, నాలుక, పెదవుల కదలికలు, గాలి సరఫరా లోని అసమానతలు సరిచేయడం, వాటిని సమన్వయంతో పని చేయించ గలడం జరుగుతుంది, తద్వారా నత్తి ఉన్నవారు మామూలుగా మాట్లాడ గలుగుతారు. వాస్తవంగా జబ్బు కాదు. ఇబ్బంది మాత్రమే. మాటలు తడబడుతున్నా, ఆగుతూ, సాగుతూ ముక్కలు ముక్కలుగా వస్తున్నా నిపుణులను సంప్ర దించాలి. స్పీచ్ థెరపీ చేస్తే నత్తి నూరు శాతం తగ్గుతుంది. వయస్సును బట్టి థెరపీ ఉంటుంది. స్పీచ్ ట్రైనింగ్ ద్వారా సాధారణం గానే మాట్లాడేలా చేయవచ్చు. నత్తి ఉన్న పిల్లలు మాట్లాడు తున్నప్పుడు వాళ్లు చెప్పేది పూర్తిగా వినాలి. వాళ్లను తొందర పెట్ట కూడదు. వాళ్లకు మాట మాట్లాడు తున్నప్పుడు నత్తి వస్తుంటే వాళ్ల తరఫున మనమే మాట్లాడ కూడదు. వాళ్లు మాట్లాడు తుండగా మధ్యలోనే అందుకుని మాట్లాడ కూడదు. వాళ్లు చెప్పదలచుకున్నది పూర్తిగా చెప్పే వరకూ ఆగి వినాలి. వాళ్లను పూర్తిగా మాట్లాడ నిచ్చేలా ప్రోత్సహించాలి. స్పీచ్ ఫ్లుయెన్సీ, స్టామరింగ్ మాడిఫికేషన్ వంటి స్పీచ్‌థెరపీ ప్రక్రియల ద్వారా మంచి ప్రయోజనం ఉంటుంది. చాలా మంది భాషావేత్తలు, వక్తలు ప్రాక్టీస్ ద్వారా నత్తిని జయించిన వారు ఉన్నారు. నత్తిని అధిగమించాలి అనుకున్నవారు ఈఎన్‌టీ నిపుణులను, స్పీచ్ థెరపిస్ట్‌లను సంప్రదించాలి. అదే సమయంలో ఈ సమస్యకు ఇంట్లో కూడా కొన్ని సాధారణ విధానాలు మరియు పద్దతులను ఉపయోగించి సమస్యను అధిగమించవచ్చు.

# మీసరగండ విశ్వరూపాచారి గారి జన్మదిన జ్ఞాపకం



విద్వాన్ విశ్వం గారు 1915, అక్టోబరు 21న అనంతపురం జిల్లాలో తరిమెల గ్రామంలో ఒక విశ్వబ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. తండ్రి మీసరగండ మునిరామాచార్యులు. విశ్వం చిన్నతనంలో స్వగ్రామంలోని రామాయణం శంకరశాస్త్రి వద్ద సంస్కృతం నేర్చుకున్నాడు. సంప్రదాయ పద్ధతిలో కర్నూలు, ప్రొద్దుటూరు లలో సంస్కృత కావ్య నాటకాలంకారాలను, తర్కశాస్త్రాన్ని ఆభ్యసిం చాడు. మద్రాసు విశ్వవిద్యాలయం నుండి సంస్కృతంలోనూ, ఆంధ్రంలోనూ విద్వాన్ పట్టాపుచ్చుకున్నాడు. అనంతపురంలో చిలుకూరు నారాయణరావు వద్ద శిష్యరికం చేశాడు. కాశీ విశ్వవిద్యాలయం లో పరిశోధనచేస్తూ అనారోగ్యం వలనపూర్తి చేయలేక పోయారు.

**రాజకీయరంగం ప్రవేశం....**

బెనారస్ నుండి అనంతపురం తిరిగిరాగానే తరిమెల నాగిరెడ్డితో కలిసి రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించాడు. ప్రజలను చైతన్యపరచటానికి గ్రంథ ప్రచురణ అవసరమని భావించి నవ్య సాహిత్యమాల అనే ప్రచురణ సంస్థ ఏర్పాటు చేసి నవ్యసాహితి అనే పత్రికకు సంపాదకత్వం వహించాడు. ఫాసిజం మొదలైన అంశాలపై పుస్తకాలను ప్రచురించాడు. దానితో బ్రిటీషు ప్రభుత్వం రాజద్రోహం క్రింద తరిమెల నాగిరెడ్డిని, విద్వాన్ విశాన్ని అరెస్టు చేసి మొదట బళ్ళారిలోని అల్లీపూర్ జైల్లోనూ ఆ తర్వాత తిరుచిరాపల్లి కారాగారం లోనూ నిర్బంధించింది. తిరుచిరాపల్లి జైలులో విశ్వం బెజవాడ గోపాలరెడ్డి వద్ద బెంగాలీ నేర్చుకున్నాడు. ఈ జైలులో రాజాజీ, టంగుటూరి ప్రకాశం వంటి నాయకుల సాహచర్యం లభించింది. ఇతను అనంతపురం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా, రాయలసీమ కాంగ్రెస్ కమిటీ కార్యాలయ కార్యదర్శిగా, అనంతపురం జిల్లా జాతీయసభకు, జిల్లా లోకజనసంఘానికి, మండల క్షామనివారణ సభకు, జిల్లా ఆంధ్రమ హాసభకు ప్రధాన కార్యదర్శిగా, జిల్లా రైతు మహాసభకు ఉపాధ్యక్షుడుగా పనిచేశారు.

**పత్రికారంగంలో.....**

ఉద్యమం, ఉపన్యాసం మాత్రమే కా కుండా మరింత లోతుగా రాజకీయా లు శాస్త్రపద్ధతిలో వివరించడానికి పత్రికారంగం వైపు దృష్టి సారించా డు. అడవి బాపిరాజు ఆహ్వానించడంతో మీజాన్ పత్రికలో 1945లో అసిస్టెంట్ ఎడిటర్‌గా చేరి కొంతకాలం పనిచేశాడు. తరువాత విజయ వాడలో ప్రజాశక్తి దినపత్రికలో అసిస్టెంట్ ఎడిటర్‌గా సుమారు మూడు సంవత్సరాలు పనిచేశాడు. "మీజాన్" పత్రికలో రచనావ్యా సంగం, "ప్రజాశక్తి"లో సంపాదకత్వం పాండితీభాషలోనే సులభశైలిని సాధించగలిగినా, పరిపాలనా యంత్రాంగపు నిర్బంధాలకు గురయ్యాడు. తర్వాత మద్రాసుకు తరలివెళ్ళి అక్కడ బాలభారత్ విద్యాలయంలో సంపాదకుడిగా కొన్నాళ్ళు పనిచేశాడు. 1952 ఆగష్టు 15న ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ప్రారంభమైనపుడు దానిలో ఎడిటర్ ఇన్‌చార్జ్‌గా చేరి 1959 వరకు పనిచేశాడు. 1959లో ఆంధ్రపత్రిక దినపత్రికలో అసిస్టెంట్ ఎడిటర్‌గా కొంతకాలం పనిచేసి 1960లో విజయవాడకు వచ్చి ఆంధ్రజ్యోతి దినపత్రికలో అసోసియేట్ ఎడిటర్‌గా పనిచేశాడు. మళ్ళీ 1963లో ఆంధ్రప్రభ దినపత్రికకు అసోసియేట్ ఎడిటర్ చేరాడు. 1967లో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికకు సంపాదకుడిగా మారాడు. ఆంధ్రప్రభ సచిత్రవార పత్రికలో పదవీవిరమణ చేసిన తరువాత 1981నుండి తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగానికి ప్రధాన సంపాదకునిగా వ్యవహరించాడు. ఈ సమయంలో విశ్వం కథాసరిత్సాగరాన్ని 12 సంపుటాలుగా తెనుగించాడు. "చందమామ"లో ద్విపద కావ్యం రూపంలో వ్రాసిన పంచతంత్ర కథలను బాపు బొమ్మలతో తి.తి.దే.ప్రచురణగా వెలువరించాడు. బ్రహ్మసూత్రాలు శంకరభాష్యం నాలుగు సంపుటాలను, అథర్వణ వేదాన్ని అనువాదం చేసి ప్రచురించారు. 1987 అక్టోబర్ 19వతేదీ తనువు చాలించారు.

**రచనలు.....**

1) విరికన్నె (కావ్యం), 2) ఆత్మసాక్షి (కవిత్వం)3) ప్రేమించేను (నవల), 4) పెన్నేటిపాట (కావ్యం)5) ఒకనాడు (కావ్యం), 6) నాహృదయం (కావ్యం)7) పాపం, 8) రాతలూ గీతలూ, 9) సమీక్ష10) లెనిన్, 11) స్టాలిన్, 12) స్వతంత్రం13) మహాశిల్పి, 14) మహాసంకల్పం15) అదీ రష్యా, 16) స్వతంత్రం ఏం చేయటం17) ఫాసిజం దాని ధ్వంసం,18) రష్యా యుద్ధకవులు 19) రానున్న సంక్షోభం, 20) సత్యభామ21) ప్రథమ ప్రేమ, 22) ధర్మదుర్గం23) పొద్దుతిరిగింది, 24) స్వస్తిశ్రీ25) కచ దేవయాని, 26) ద్వేషం27) దురాక్రమణ, 28) ఇరాన్29) ఇండియా, 30) ఇండోనేషియా31) వియత్నాం, 32) నీడలు – జాడలు33) విక్రమోర్వశీయము (రేడియో నాటకము)34) నాగానందము (రేడియో నాటకము)35) యుద్ధం మాకొద్దు (రేడియో నాటకము)36) ఏమి చెయ్యడం?, 37) మాణిక్యవీణఇంకా లెక్కలేనన్ని అనువాదాలు మరియు వివిధ పత్రికల్లో అనేక అనువాదాలు నిర్వహించిన శీర్షికలు....1) విశ్వభావన – శ్రీసాధన పత్రిక 1938–19392) తెలుపు–నలుపు – ఆంధ్రప్రభ వారపత్రిక 1952–19593) అవీ–ఇవీ – ఆంధ్రపత్రిక దినపత్రిక 1958–19594) ఇవ్వాళ – ఆంధ్రజ్యోతి దినపత్రిక 1960–19625) టీకా–టిప్పణి – ఆంధ్రజ్యోతి దినపత్రిక 6) మాణిక్యవీణ – ఆంధ్రప్రభ దినపత్రిక 1962–1966, ఆంధ్రప్రభ వారపత్రిక 1967–1987

సేనాధిపత్యం రమేష్

# యుటిఎఫ్ జిల్లా అధ్యక్షునిగా మాదన విజయ కుమార్

## ఐదవ సారి ఏకగ్రీవంగా ఎన్నిక



**బద్వేలు అక్టోబరు 21 (ఆంధ్రపత్రిక) :** ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) కడప జిల్లా అధ్యక్షునిగా మాదన విజయ కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం కడప పట్టణంలోని యుటిఎఫ్ భవన్ లో జరిగిన యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలలో విజయకుమార్ ను జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన జిల్లా అధ్యక్షు లుగా ఎన్నిక కావడం ఇది ఐదవసారి. విజయ ౹కుమార్ ఉపాధ్యాయునిగా ఉంటూ ఉపాధ్యాయ ఉద్యమాలలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. విద్యార్థి దశ నుండే విద్యార్థి సంఘ నాయకునిగా ఉంటూ విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. ఆయన ప్రస్తుతం ఉపాధ్యాయ సంఘాలకు ప్రాతినిథ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) కు కడప జిల్లా చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలక వర్గాలు ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతు న్నాయని, కార్పోరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ ప్రభుత్వ విద్యా రంగాన్ని పతనం చేస్తున్నాయని ఆరోపించారు. పాలకులు నూతన జాతీయ విద్యా విధానం పేరుతో ప్రాథమిక విద్యను నీర్వీర్యం చేసేందుకు ప్రయత్ని స్తున్నారని విమర్శించారు. భవిష్యత్తులో విద్యా రంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులను కూడగట్టి ఉద్యమాలు చేపడుతామని ఆయన పేర్కొన్నారు. తనను జిల్లా అధ్యక్షునిగా ఐదవ సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్న యుటిఎఫ్ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

### దస్తగిరమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన

# ఎమ్మెల్యే మాధవి రెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి

## కుటుంబ సభ్యులకు రూ. 1 లక్ష ఆర్థిక సాయం



**కడప అక్టోబరు 21 (ఆంధ్రపత్రిక) :** బద్వేలు పట్టణంలో ప్రేమోన్మాది చేతిలో దారుణంగా హత్యకు గురైన దస్తగిరమ్మ కుటుంబ సభ్యులను ఇంటికి వెళ్లి పరామర్శించిన కడప ఎమ్మెల్యే ఆర్ మాధవిరెడ్డి మరియు తెదేపా జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి బద్వేలు తెదేపా బాధ్యులు రితేష్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట్లాడుతూ దస్తగిరమ్మ పై కిరాతకంగా దాడి చేసి చంపిన నిందితుడు విగ్నేష్ కి కఠిన శిక్ష అమలు పరిచే విధంగా మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలీసు శాఖ వారిని ఆదేశించారని, అలాగే వారి కుటుంబానికి కడప ఎమ్మెల్యే ఒక 1.లక్ష రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేత ఈ కార్యక్రమంలో బద్వేలు పట్టణ అధ్యక్షుడు గుర్రంపాటి వెంగళరెడ్డి బద్వేలు రూరల్ పార్టీ అధ్యక్షుడు బసిరెడ్డి రవికుమార్ (టీవీఎస్ రవి) టిడిపి నాయకుడు చెరుకూరు రవికుమార్ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### బిజెపి చెంతకు చేరిన ఈడిగ ఆడిమూర్తి

# కాంగ్రెస్ పార్టీ కానే కాదు

## డిసిసి అధ్యక్షుడు యం. యచ్. ఇనాయతుల్లా

**హిందూపురం, అక్టోబరు 21 (ఆంధ్రపత్రిక) :** ధర్మవరంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సమక్షంలో బిజెపి చెంతకు చేరిన ఈడిగ ఆదిమూర్తి కాంగ్రెస్ పార్టీ కానేకాదని శ్రీ సత్య సాయి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యం.యచ్.ఇనాయతుల్లా పేర్కొన్నారు. ఆదిమూర్తి సాధారణ ఎన్నిక ముందు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి హిందూపురం పర్యటనలో భాగంగా అంబేద్కర్ విగ్రహం దగ్గర ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కండువా వేసుకొన్న విషయం ప్రజలకు తెలుసునన్నారు. అది మరచిన ఆయన కాంగ్రెస్ పార్టీ నుండి బిజేపి తీర్థం పుచ్చుకున్నానని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. నాయకులు ఒక పార్టీ నుండి వేరే పార్టీలలో చేరడం వారీ వారీ జన్మ హక్కు అని అయితే విలువలు మరువ కూడదని ఇనాయతుల్లా హితబోధ చేశారు. ఆదిముర్తిని కాంగ్రెస్ పార్టీ అదేసాను సారం ఆ రోజే కాంగ్రెస్ పార్టీ నుండి తొలగించడం జరుగిందని పేర్కొన్నారు.

### బాధితురాలికి న్యాయం చేయాలి

# నిందితుడిని కఠినంగా శిక్షించాలి



**బద్వేలు అక్టోబరు 21 (ఆంధ్రపత్రిక) :** బద్వేలులో మైనర్ బాలికను ప్రేమోన్మాది విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని భాదిత విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ బద్వేలు పట్టణంలో డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో బద్వేలు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న భగత్ సింగ్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించడ జరిగింది.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్నిలు మాట్లాడుతూ దేశంలో,రాష్ట్రంలో మహిళలపై నిత్యం దాడులు అత్యాచారాలు పెరిగి పోతున్నాయని అన్నారు. వీటిని అరికట్టడంలో పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని దేశంలో బలమైన చట్టాలు లేకపోవడంతో అనునిత్యం మహిళలు,విద్యార్థినిలుపై అనేక రూపాలలో దాడులు పెట్రేగి పోతున్నాయని అన్నారు. గతంలో నిర్భయ లాంటి చట్టాలు వున్న అవి కాగితాలకే పరిమితం అవుతున్నాయని అన్నారు.బద్వేలు లో జరిగిన సంఘటన సభ్య సమాజం సిగ్గు పడేలా వున్నదని అన్నారు.బాధితురాలు కుటుంబానికి 50 లక్షల రూపాయలు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని,ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని,ప్రేమోన్మాది విఘ్నేష్ నీ కఠినంగా శిక్షించాలని వారి డిమాండ్ చేశారు లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన పోరాటాలు చేపడతామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు భాను ప్రకాష్ డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె.మస్తాన్ షరీఫ్ ఎస్. కె.ఆదిల్ బద్వేలు రూరల్ కార్యదర్శి యు.బాలగురవయ్య పట్టణ ఉపాధ్యక్షులు సురేష్ మా పీర,రాజు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలను

# పరిష్కరించేందుకు కృషి చేయాలి

## ఇంఛార్జి జిల్లా కలెక్టర్ అదితి సింగ్



కడప అక్టోబర్ 21(ఆంధ్రపత్రిక):జిల్లా లోని సుదూర ప్రాంతాల నుండి తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో ప్రజలు వస్తారని అర్జీదారుల సమస్యలను అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఇంఛార్జి జిల్లా కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు సోమవారం కలెక్టరేట్లోని ప్రజాసమస్యల పరిష్కార వేదిక సమావేశ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం జరిగింది.ఇందులో ఇంఛార్జి జిల్లా కలెక్టర్ అదితి సింగ్ తో పాటు డి.ఆర్ ఓ గంగాధర్ గౌడ్, డిఆర్డీఏ పీడి ఆనంద్ నాయక్, ఐసిడిఎస్ పిడి శ్రీలక్ష్మి, లు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఇంఛార్జి జిల్లా కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికా రులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీ లించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు.పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించా లన్నారు ఈ కార్యక్రమం లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారు లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన విద్యార్థి కుటుంబాన్ని

# పరామర్శించిన ఎంపీ అవినాష్ రెడ్డి

## కుటుంబానికి అండగా ఉంటామన్న ఎమ్మెల్యే ఎంపీ, అవినాష్‌రెడ్డి, డాక్టర్ సుధా ఎమ్మెల్సీ డి.సి. గోవింద్ రెడ్డిలు



### విద్యార్థిని కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటాం



బద్వేలు అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక): బద్వేలు ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన విద్యార్థిని కుటుంబ సభ్యులను పరామర్శించిన కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి హత్యకు గురైన విద్యార్థి కుటుంబాన్ని పరామర్శచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.ఆడ పిల్లలున్న ప్రతి తల్లిదండ్రులు బాధపడుతున్నారని, మాటల్లో చెప్పలేని అమానుషం ఇది 2021లో ఇలాంటి సంఘటన గుంటూరులో జరిగినప్పుడు కొద్ది రోజుల్లోనే కన్విక్ట్ చేశారు.ఈ నాలుగు మాసాల్లో 74 సంఘటనలు ఇలాంటి సంఘటనలు జరిగితే ఈ ప్రభుత్వం ఏమి చేస్తోందిని, ఏపిలో అసలు శాంతి భద్రతలు ఉ న్నాయా? హెూం మంత్రి అన్నీ చోట్ల సెక్యూరిటీ ఇవ్వలేం కదా అంటూ వెటకారంగా మాట్లాడుతున్నారన్నారు. ఈ విద్యార్థిని 10వ తరగతిలో స్కూల్ ఫస్ట్ అలాంటి పాప చనిపోవడం బాధాకరమని,ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర నుంచి మేల్కొవాలన్నారు. డాక్టర్ దాసరి సుధ, మాట్లాడుతూ మన రాష్ట్రంలో మహిళలపై ఇంత దారుణాలు జరుగుంటే మహిళా హెూమ్ మంత్రి ఏమి చేస్తున్నారన్నారు. దీంట్లో రాజకీయాలుకు తావు లేదు..గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. నా బిడ్డ చనిపోయినట్లు మరొకరు చనిపోరని నమ్మకం ఏమిటి అని ఆ తల్లి ప్రశ్నిస్తోందని, ఆమెకు ఈ ప్రభుత్వం ఏమి సమాధానం చెప్తుందని ప్రశ్నించారు. ఈ కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తాం అని తెలిపారు ఎమ్మెల్సీ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ కుటుంబానికి కావాల్సిన సహాయ సహకారాలన్నీ మా పార్టీ తరపున అందిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో వీరితోపాటు నియోజకవర్గ సమన్వయకర్త రమణారెడ్డి గురు బద్వేల్ పట్టణ వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు గుర్రంపాటి సుందరామిరెడ్డి ఆడ మాజీ చైర్మన్ గురుమోహన్ బంగారు సీనయ్య బద్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి వైఎస్ఆర్సిపి మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి బద్వేలు రూరల్ పార్టీ అధ్యక్షుడు పోకల మల్లేశ్వర్ రెడ్డి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఈ రాష్ట్ర స్థాయి పోటీలు



### యువత చదువుతో పాటు క్రీడల నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

### రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభించిన వసుంధర



హిందూపురం, అక్టోబర్ 21 ( ఆంధ్ర పత్రిక ) యువతలో క్రీడా స్ఫూర్తి నింపేందుకు పట్టణంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బాలయ్య సతీమణి వసుంధర దేవి పేర్కొన్నారు. సోమవారం ముద్దిరెడ్డిపల్లిలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె క్రీడా జ్యోతి వెలిగించి క్రీడా పతాకం ఎగురవేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి వసుంధర దేవి మాట్లాడుతూ క్రీడలు అంటే ఎమ్మెల్యే బాలకృష్ణకి ఎంతో ఇష్టమని క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో హిందూపురంలోని శిథిలావస్థకు చేరిన ఇండోర్ స్టేడియంను బాగు చేసేందుకు రెండు కోట్ల నిధులను మంజూరు చేశారని వసుంధర దేవి తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడ తాయని, వ్యక్తి అభ్యున్నతికి క్రీడలు దోహదపడతాయన్నారు. పోటీలో పాల్గొన్న క్రీడాకారులు స్ఫూర్తిదాయకంగా తమ ఆటను ప్రదర్శించాలని గెలుపోటములు సహజమన్నారు. విద్యార్థి దశలో చదువుతోపాటు క్రీడలు కూడా ఒక భాగమని, క్రీడల వల్ల చిన్నారు లు యువకులు ఉత్సాహంగా ఉండేందుకు ఉపయోగపడతాయ న్నారు. అనంతరం వాలీబాల్ ఆడి క్రీడలను వసుంధర దేవి ప్రారంభించి ఆహుతులను అలరించారు. అనంతరం క్రీడాకారుల పరిచయం చేసుకొని వారిని ప్రోత్సహించారు ఈ కార్యక్రమంలో షాప్ చైర్మన్ రవి నాయుడు, తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేంద్రబాబు, ఎంఈఓ గంగప్ప, టీడీపీ నాయకులు పామీశెట్టి శేఖర్, బండారు బాలాజీ, పల్లా లక్ష్మి కుమార్, గ్రీన్ పార్క్ నాగరాజు, బేవనహళ్లి ఆనంద్, డిఈ రమేష్,ఏసీ నాగరాజ్, మంచాల మారుతి, మంజుతో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి అమ్ముతుందని వదినకు మరిది బెదిరింపులు

## జిల్లా కలెక్టరు రాజకుమారికి ఫిర్యాదు చేసిన వదిన

నందికొట్కూర్ అక్టోబర్21, ఆంధ్ర పత్రిక, పిల్లల ఉన్నత చదువుల కోసం మరియు అనారోగ్యాల కారణాలతో అత్తమ్మ కు ఖర్చుపెట్టి లక్షల రూపాయలు అప్పు చేస్తే తమ భాగానికి, వచ్చిన పొలం, అమ్ముకొని అప్పులు చెల్లిస్తామని అనుకుంటే మరిది కూరాకుల ఓబులేసు దౌర్జన్యానికి పాల్పడుతూ, అమ్మితే చంపేస్తానని బెదిరింపులకు గురి చూస్తున్నాడని, అన్నా వదిన, పిల్లలను సైతం, వేధిస్తుండడంతో చేసేది ఏమీ లేక సోమవారం నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీ రాజకుమారి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మహిళ ఫిర్యాదు చేసిన సంఘటన చోటుచేసుకుంది,వివరాలు ఇలా ఉన్నాయి, ఉద్యోగరీత్యా, నందికొట్కూరు లో నివాసం ఉంటున్న కూరాకుల, లక్ష్మీదేవి భర్త కూరాకుల రంగస్వామి గత ఆరు సంవత్సరాల క్రితం డోన్ మండలం, ఎర్రగుంట్ల గ్రామంలో పూర్వం ఆస్తి తల్లిదండ్రులు ఆడపడుచులు, గ్రామ పెద్దల సమక్షంలో ఆస్తులను పంపకాలు చేశారు, మరిది అయినా కూరాకుల ఓబులేసు, అతనికి నచ్చిన, ఆస్తులను, ఉద్యోగం లేదని కారణంతో, అందరి సహకారంతో, తనకు నచ్చిన ఆస్తులను అడిగాడు, అందుకు తల్లిదండ్రులు, ఆడపిల్లలు, పెద్ద మనుషులు, అన్న ఆయన రంగస్వామికి, పెద్ద మనసు చేసుకొని, చిన్నవాడుఓబులేసు,కోరుకున్న ఆస్తులు ఇవ్వాలని, వేడుకున్నారు, దీనికి భార్యతో సంబంధం లేకుండా, వారి బంధువులతో సంబంధం లేకుండా, తన తమ్ముడు బాగుపడాలనే ఉద్దేశంతో అడిగిన ఆస్తులను అతను తీసు కోగ, మిగిలిన ఆస్తులను డిమాండ్ తక్కువ ఉన్న ఆస్తులను అన్న భాగానికి ఇచ్చి, పెద్దలందరి సమక్షంలో దానవిక్రయం అగ్రిమెంటు రాసుకున్నారు, పట్టాదారు పాస్ పుస్తకం కోసం వెళితే, ఇది చట్ట ప్రకారం చెల్లదు, ఇది పూర్వీకుల ఆస్తి కాబట్టి రిజిస్టర్ చేయాలని రెవెన్యూ అధికారులు చెప్పడంతో, ఒక సంవత్సరం తర్వాత దానవిక్రయం లో రాసినటువంటి ఆస్తులను విభాగ దస్తావేజుగా రిజిస్టర్ చేశారు, ఆ రోజు నుండి ఈరోజు వరకు ఎవరికి సంబంధించిన ఆస్తులను వారు అనుభవిస్తూ జీవిస్తున్నారు, కానీ మాకు అప్పులు ఎక్కువ కావడంతో చేసిన అప్పులు తీర్చడానికి, వేరే దారి లేక పొలం అమ్మడానికి వెళితే, చంపివేస్తానని బెదిరింపులకు పాల్పడుతూ, దౌర్జన్యానికి దిగుతున్నాడని, మా కుటుంబాన్ని మానసికంగా, నా భర్త ఆర్టీసీ మెకానిక్ ఉద్యోగ రిత్యా బిజీగా ఉండడంతో మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాడు , మాకు వచ్చే 13 వేల రూపాయల జీతం సరిపోక అప్పులు ఎక్కువ అయిపోవడంతో, తీర్చే దారి లేక, ఆస్తులు అమ్మి, కట్టాలని ఉద్దేశంతో మేము ఉన్నప్పటికీ మాకు ఇబ్బందులకు గురిచేస్తున్న మా మరిది కురాకుల ఓబులేసు పై చర్యలు తీసుకొని, మాకు న్యాయం చేయాలని, బాధ్యతమహిళ కూరాకుల లక్ష్మీదేవి కలెక్టర్ కి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

### టిడిపి, బిజెపి, జనసేన పార్టీలు

# మహిళలను నమ్మించి మోసం చేశాయి

### డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి



**వేంపల్లి అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో టిడిపి,జనసేన,బిజెపి పార్టీలు మహిళలను నమ్మించి మోసగించడం శోచనీయం,అన్యాయం.గత ఎన్నికల్లో పై కూటమి అధికారంలోకి వచ్చేదానికి మహిళల ఓట్లు ప్రధాన కారణం. గత ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీలు ప్రధానంగా మహిళలకు 3 హామీలు ఇచ్చాయి.మహిళలు ఆ హామీలను నమ్మి మూకుమ్మడిగా కూటమి పార్టీలకు ఓట్లు వేశారు.అందువల్లనే 175 సీట్లకు గాను 164 సీట్లు వచ్చాయి.కూటమిఅధికారంలోకి వచ్చి 4నెలల 10 రోజులయింది.ఒక్క హామీ కూడా అమలు కాలేదు.ఏరు దాటినంత వరకు ఓడ మల్లన్న,దాటినాక బోడి మల్లన్న అన్నట్లుంది వాలకం.

**వారు ఇచ్చిన హామీలు**

1.మహిలలకు ఉచిత బస్సు ప్రయాణం.అమలు కాలేదు.

2.ప్రతి ఇంటికీ ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్ల ఉచితంగా సరఫరా.దీపావళి నుండి తెల్ల కార్డుదారులకు అమలు చేస్తామంటున్నారు.మ్యానిఫెస్టోలో చెప్పింది ప్రతి ఇంటికీ గ్యాస్ ఇస్తామని అన్నారు.. కానీ ఇప్పుడు తెల్ల కార్డు ఉన్న వారికి మాత్రమే అని అంటున్నారు.3.మహా లక్ష్మి పథకం క్రింద 19- 59 సంవత్సరాల మధ్య వున్న ప్రతి మహిళకు నెలకు రు 1500 ఆర్థిక సాయం. అమలు కాలేదు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం బంగారు తల్లి,అమ్మ హస్తం పథకాలను అమలు చేసేది. బంగారు తల్లి: 1-5-2013న బాలికా సాధికారిత కోసం బంగారు తల్లి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించగా తర్వాత వచ్చిన ప్రభుత్వాలు రద్దు చేశాయి.అమ్మ హస్తం ఉప్పు కందిపప్పు ఉప్పు,కందిపప్పు,చింతపండు తదితర 9 నిత్యావసర సరుకులు సబ్సిడీ ధరకు సరఫరా చేసే విధంగా 2013 ఉగాది నాడు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ హస్తం పథకాన్ని ప్రవేశపెట్టింది.తర్వాత వచ్చిన ప్రభుత్వాలు రద్దు చేసాయి.

**కాంగ్రెస్ డిమాండ్లు**

1. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని వెంటనే అమలు చేయాలి.
2. తెల్ల కార్డు దారులకే కాకుండా ప్రతి ఇంటికీ ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్ల ఉచితంగా సరఫరా చేయాలి.
3. 19- 59 సంవత్సరాల మధ్య వున్న ప్రతి మహిళకు నెలకు రూ1500 లు ఇవ్వాలి.
4. బాలికా సాధికారిత కోసం బంగారు తల్లి పథకాన్ని పునః ప్రారంభించాలి.
5. అమ్మ హస్తం పథకాన్ని పునః ప్రారంభించాలి. (528)

# శాంతి భద్రతల నిర్వహణలో పోలీస్ పాత్ర ఎనలేనిది



పుట్టపర్తి, అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక): శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కొనియాడారు.పుట్టపర్తి ధర్మశాలలో సోమవారం నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే మాట్లాడారు...పగలు రాత్రి అని తేడా లేకుండా పండుగలు పబ్బాలు పట్టించుకోకుండా తమ కుటుంబాలను సైతం పక్కన పెట్టి ప్రజల ధన,మాన ప్రాణాలు కాపాడడంలో తమ ప్రాణాలు సైతం ప్రాణంగా పెట్టి విధి నిర్వహణలో అసువులు బాసి అమరులైన పోలీసులందరికీ నా జోహార్,జోహార్,జోహార్లు అర్పిస్తున్నాను.తన తండ్రి కేరళలో పోలీస్ అధికారిగా పనిచేశారని,తాను కూడా పోలీస్ బిడ్డనే అని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.మీ కుటుంబ సభ్యురాలిగా మీ కష్టాలు,సమస్యలు పరిష్కరించడానికి నా వంతు పాత్ర పోషిస్తానని ఆమె పేర్కొన్నారు.పోలీసులు కష్టాలు

## పోలీసు కుటుంబ సభ్యులకు నా సెల్యూట్

## నేను మీ పోలీస్ బిడ్డనే

## మీ పోలీస్ బిడ్డగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

## ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

నాకు బాగా తెలుసని ఆమె తెలిపారు.మీ సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందు ఉండి వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు.విధి నిర్వహణలో ఉన్న పోలీసుల కష్టాలు ఎవరికీ చెప్పుకోలేనివని,అయితే ప్రతి వ్యక్తి సమస్యలు పోలీసులకు చెప్పుకునేందుకు రాజ్యాంగం అవకాశం కలించిందని ఇది దేవుడు ఇచ్చిన వరం అన్నారు.ప్రజలకు సేవ చేసే భాగ్యం మన పోలీసులకు ఇచ్చిన ఆ దేవునికి ఎల్లవేళలా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.అందుకే పోలీసులు విధి నిర్వహణలో ఎంతో నీతి నిజాయితీతో ప్రజలకు సేవలు అందించాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.

మావోయిస్టుల చేతిలో ప్రాణాలు పోగొట్టుకున్న వారిలో పుట్టపర్తి మండలం బీడుపల్లి చెందిన చంద్రశేఖర్ అలాగే పేరూరు వద్ద నక్సలైట్ల చేతిలో మృతి చెందిన అనంతపురం రహమత్ నగర్ చెందిన బాబావలి కుటుంబాలను పరామర్శించారు.వారికి ఒక్కరికీ రూ.20000 ల చొప్పున పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్వయంగా మొత్తం రూ.40000లు నగదు ఆ కుటుంబాలకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి,జిల్లా న్యాయమూర్తులు,కలెక్టర్,ఎస్పీ,ఏఎస్పీ,డిఎస్పి లు,సిఐలు,ఎస్ఐలు,పోలీస్ కానిస్టేబుళ్లు,పోలీస్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సతీమణి వసుంధర దేవిని

# సన్మానించిన టిడిపి నాయకులు



హిందూపురం, అక్టోబర్ 21 ( ఆంధ్ర పత్రిక ) చిలమత్తూరు గ్రామంలో జరిగిన వివిధ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవిని లేపాక్షి టిడిపినాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లేపాక్షి మండల టిడిపి కన్వీనర్ ఈ జయప్ప,మాజీ ఎంపీపీ ఆనంద్ కుమార్,టిడిపి సీనియర్ నాయకుడు ఆర్ సూర్య ప్రకాష్ లు చిలమత్తూరులో వసుంధర దేవుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక శ్రద్ధ కనబరిచి హెరిటేజ్ కంపెనీ ద్వారా విద్యార్థిని, విద్యార్థులకు ఉపయోగపడే కంప్యూటర్లు , జిరాక్స్ మిషన్, ఫ్యాన్లు అందించడం చాలా సంతోషమని టిడిపి నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేంద్రబాబు, బాలాజీ, రంగారెడ్డి,పరిమళ, శ్రీదేవి, లేపాక్షి మండల కన్వీనర్ జయప్పతో పాటు పెద్ద ఎత్తున తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఆదోని నుండి దేవనకొండకు రెగ్యులర్ బస్సు సౌకర్యం కల్పించండి : కాకర్ల శాంతి కుమార్

దేవనకొండ అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక): దేవనకొండ నుంచి ఆదోని కి ప్రతి రోజు రెగ్యులర్ గా బస్ సౌకర్యం కల్పించాలని DVMC మెంబెర్ :కాకర్ల శాంతికుమార్ కర్నూల్ జిల్లా ఏపీఎస్ఆర్టీసీ(APSRTC RM) రీజనల్ మేనేజర్ టి శ్రీనివాసులు కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూల్ జిల్లా లో అతి పెద్ద మండలం దేవనకొండ, మండలంలో 44 గ్రామాలు ఉన్నాయి.ఇక్కడ రైతులు ఎక్కువగా పత్తి, వేరుశనగ పంట సాగుచేస్తున్నారు.పంట అమ్మడం కోసం ఆదోని వ్యవసాయ మార్కెట్ కు అధిక సంఖ్యలో రైతులు వెళుతుంటారు, అదేవిదంగా వ్యాపార అవసరాల నిమిత్తం ప్రజలు మరియు రైతులు పంట తో పాటు రైతులు కూడా ఆటోలో వెళ్తున్నారు. దేవనకొండ మండలానికి ఆదోని నుంచి సరైన బస్ సౌకర్యం లేక రైతులు అమ్ముకున్న పంట సొమ్మును భయం గుప్పెట్లో పెట్టుకొని వస్తున్నారు. అదే విధంగా ఆటోలు క్రింద పడి ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. దేవనకొండ నుంచి ఆస్పరి మీదుగా ఆదోని కి ప్రతి రోజు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని వారు కోరారు.

# దేవనకొండలో పొలంబడి



దేవనకొండ, అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక): దేవనకొండ మండల పరిధిలోని ఐరన్ బండ గ్రామం నందు సోమవారం మండల వ్యవసాయ అధికారి సిహెచ్ సురేష్ బాబు ఆధ్వర్యంలో గ్యాప్ పొలంబడి నిర్వహించడం జరిగినది. వేరు శనగ పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.పంట విత్తే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలని అలాగే 15 సార్లకు వేరుశనకు ఒక్క కంది సార్లు వేసుకోవాలని అలాగే అక్కడక్కడ బంతిపూలు వేసుకోవలెను.విత్తన శుద్ధికి ట్రైకోడెర్మా విరిడి 50 కిలో విత్తనాలకు కేజీ చొప్పున విత్తన శుద్ధి తెగులు రాకుండా సాఫ్ కూడా విత్తని శుద్ధి చేసుకోవాలి 20 రోజుల పంట కాలంలో వేప నూనె 2.5 %మీ% లీటర్ వాట్ కి కలుపుకొని మరియు ఆసేపేట్ 2.5 గ్రాముల ఒక్క వాటర్ కి కలుపుకొని స్ప్రే చేయాలి. వేరుశనగ పంటలో విత్తిన 35 రోజుల తర్వాత ఎకరాకు 100 కిలోల జిప్సం పంట పైన చల్లుకోవలెను ఈ విధంగా చేస్తే దిగుబడి ఎక్కువ వస్తుంది. వేరుశనగ పంటలో పురుగు ఎక్కువగా ఉన్నప్పుడు ఆకుపచ్చ పురుగు మరియు లద్దపురుగు ఎక్కువగా వస్తుంది అందువలన దాని నివారణకు క్లోరో పెరి పాస్ 2.5 మరియు మోనోపాస్ 2.0 ఒక లీటర్ వాట్ కలుపుకొని స్ప్రే చేస్తే పురుగు ఉధృతి తగ్గుతుంది ఈ విధంగా పంటలో సస్యరక్షణ పద్దుల పాటిస్తే మరియు సేంద్రియలు ఎరువులు ఎక్కువగా వాడుకోవాలి ఈ విధంగా చేస్తే వేరుశనగలు పంట లోఎక్కువ దిగుబడి తీయవచ్చును ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సిహెచ్ సురేష్ బాబు మరియు సీడు విత్తన ఉత్పత్తి అధికారి చైతన్య కుమార్ వ్యవసాయ విస్తరణ అధికారి వీ రంగన్న %ఝుు% నరసప్ప, రంగస్వామి మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు

# బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

## ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులన్ను పరామర్శించిన ఎమ్మెల్యే సతీమణి




హిందూపురం, అక్టోబర్ 21 ( ఆంధ్ర పత్రిక ) చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లిలో గ్యాంగ్ రేప్ బాధితులను ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి పరామర్శించారు.హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సుదీర్ఘంగా అరగంట పాటు మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు మహిళలపై జరగడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ సూచన మేరకే బాధితులను నేరుగా కలిసి మాట్లాడడం జరిగిందన్నారు.బాధితును అన్నివిధాల ఆదుకుంటామన్నారు. జరిగిన ఘటనపై సీఎం చంద్రబాబు సైతం వెంటనే స్పందించారన్నారు. సంఘటన జరిగిన 24 గంటల్లోపే పోలీసులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి కేసును చేదించారన్నారు .నేరస్తులకు త్వరగా శిక్ష పడేందుకు ఏపీ ప్రభుత్వం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసిందన్నారు. బాధిత కుటుంబానికి ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పిస్తూ, ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈమె వెంట తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేంద్రబాబు, బాలాజీ, ఆనంద్ తో పాటు నాయకులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

## మండల యస్ఐ వెంకటనారాయణ



అమడగూరు, అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక): పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని యస్ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు.సోమవారం మండల కేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మండల పోలీస్‌స్టేషన్‌లో అమరవీరులకు నివాళులర్పించి వారి త్యాగాలను గుర్తుచేశారు.అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ నిర్వహణ,ఆయుధాల వినియోగం,ఫిర్యాదును ఎలా స్వీకరిస్తారు.దానిపై దర్యాప్తు ఎలా కొనసాగిస్తారు.సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి.వాటిని నిరోధించడం ఎలా,వాటి బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాల గురించి వివరించారు.అనంతరం యస్ఐ వెంకటనారాయణ మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ చట్టం గురించి తెలుకోవాలని,దేశ రక్షణకు సైన్యం,పోలీస్ శాఖలో పని చేయడానికి ముందుకు రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాల సమాజానికి ప్రతిబింభం....

## పాఠశాల అభివృద్ధికి బండి సాహితిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తోడ్పాటు



గుంటూరు అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక): పాఠశాల సమాజానికి ప్రతిబింబం అని, సమాజం నుండి పాఠశాలకు ఎప్పుడూ సహకారం లభిస్తూ ఉంటేనే విద్యార్థులు పరిపుష్టంగా ఉంటారని వట్టిచెరుకూరు మండల ప్రథమ విద్యాధికారి గరిమెళ్ళ సత్యనారాయణమూర్తి అన్నారు. బండి సాహితిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండి అశోకరెడ్డి, సుధావాణి దంపతులు బండి సాహితిరెడ్డి స్మృత్యర్థం లేమల్లెపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు యాభైవేల రూపాయల విలువైన క్రీడాపరికరాలను వితరణ చేశారు. విద్యార్థులు శారీరక మానసిక పరిణతి పొందటానికి క్రీడలు దోహదం చేస్తాయని, అందుకే పాఠశాలకు ఆటసామగ్రిని సమకూర్చామని బండి అశోకరెడ్డి అన్నారు. ఇదే సందర్భంగా లేమల్లెపాడు గ్రామస్తుల వినియోగం కోసం సిమెంటు బల్లలను కూడా ట్రస్ట్ సమకూర్చింది. సభాకార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు పసుపులేటి శ్రీధర్ నిర్వహించారు. ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణ, చైర్మన్ పచ్చల ఎస్తేరు రాణి, ఉప చైర్మన్ పానుగంటి చైతన్య, గ్రామ ఉప సర్పంచ్ వల్లాపురపు సత్యనారాయణ, గ్రామపెద్దలు పాతూరి కృష్ణారావు, కొణిజేటి బులిబాబు, కాకుమాను కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరులకు

## ఘన నివాళి అర్పించిన మంచూరు సూర్యనారాయణ రెడ్డి



బద్వేలు అక్టోబర్ 21 (ఆంధ్ర పత్రిక): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు సిబ్బంది చేసే త్యాగాలు మరువ లేనివని బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత మంచూరు సూర్య నారా యణరెడ్డి ఒక ప్రకటనలో కొని యాడారు.ఈ క్రమంలో అమరు లైన పోలీసులకు మనస్ఫూర్తిగా అంజలి ఘటిస్తున్నా మన్నారు. నేడు పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సిబ్బంది సేవలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని కోరారు వ్యక్తిగత జీవితం కంటే తమ విధులకు ఎక్కువ సమయం కేటాయిస్తూ ఉంటారని విధి నిర్వహణలో ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని తెలిపారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పోలీసు శాఖ సమర్థంగా పని చేసేలా చూస్తోందని చెప్పారు .పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని మంచూరు సూర్యనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

# విద్యార్థిని మృతికి కారణమైన విఘ్నేష్ ను కఠినంగా శిక్షించాలి

## నియోజవర్గ సీనియర్ నాయకులు మంచూరు సూర్యనారాయణ రెడ్డి



అట్లూరు అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక): వైయస్సార్ జిల్లా బద్వేలు సెంచరీ ప్లైవుడ్ ఫ్యాక్టరీసమీపంలో పెట్రోల్ దాడికి గురైన ఇంజనీర్ విద్యార్థిని దస్తగిరమ్మ కడప రిమ్స్ హాస్పిటల్లో మృతి చెందిన విషయం తన మనసును కలచివేసిందని బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయడం అంటే నిందితుడు విగ్నేష్,అతనికి సహకరించిన వారికి త్వరగా శిక్షపడేలా విచారణ త్వరగా పూర్తిచేయాలని,నిందితుడు విగ్నేష్ కి మరణశిక్ష స్థాయిలో శిక్షపడేలా హొంమంత్రి వలగపూడి అనిత వైయస్సార్ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు ఆదేశాలు జారీ చేయాలని, ఇలాంటి దుర్చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా భయపడేలా శిక్షలు ఉండాలని, విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలని,విద్యార్థిని దస్తగిరమ్మ ఆత్మకు శాంతి కలగాలని,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత మంచూరి సూర్యనారాయణ రెడ్డితెలిపారు.

# కె.కె.అగ్రహారం రెవెన్యూ గ్రామసభలో అర్జీలు



కె.కోటపాడు, అక్టోబర్ 21 (ఆంధ్ర పత్రిక): గ్రామ సభల్లోరైతుల నుంచి వచ్చిన వినతులపై సంపూర్ణంగా విచారణచేసి పరిష్కరిస్తామని రీ సర్వే ఉపతహశీల్దార్ బి.సూరి అన్నారు. మండలంలోని కె.సంతపాలెం పంచాయతీ శివారు కవికొండల అగ్రహారం(కె.కె.అగ్రహారం)గ్రామంలో సోమవారం రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు.ఈ సభలో అయన మాట్లాడుతూ విజ్ఞప్తులపై విచారణలో క్షేత్రస్థాయి సందర్శన కూడాచేస్తామని చెప్పారు.సభలో 12మంది రైతుల రీసర్వే డి.టి.సూరికి అర్జీలు అందచేశారు. అర్జీలు అందజేసిన వారిలో చుక్క రమణ తదితరులు ఉన్నారు. కాగా అనంతకు ముందు సూదివలసలో జరిగిన సభలో 80 అర్జీలు, ఉగ్గినవలసలో నిర్వహించిన సభలో 14 అర్జీలు వెరసి మూడు సభల్లో మొత్తం 106 అర్జీలు అందాయి. ఈ సభలో మండల సర్వేయరు కె.రామచంద్రమూర్తి, కె.సంతపాలెం విలేజ్ రెవెన్యూ అధికారిణి సిహెచ్.సునంద, మండలంలోని పలు గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## బోరుగడ్డ అనిల్, నందిగాం సురేష్ పై

# గుంటూరు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు

## బీజేపీ యువమోర్చా మాజీ జాతీయ కార్యదర్శి పనతల సురేష్

గుంటూరు, అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక): వైసిపి మాజీ ఎంపి నందిగాం సురేష్ వైసీపీ అనుచరుడు బోరుగడ్డ అనిల్ కుమార్ పై బీజేపీ యువమోర్చా మాజీ కార్యదర్శి పి సురేష్ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ కి ఫిర్యాదు చేశారు. గతంలో అమరావతి రైతుల ఉద్యమానికి వెళ్లి వస్తున్న ప్రస్తుత ఆరోగ్య శాఖ మంత్రి, బిజెపి జాతీయ కార్యదర్శి సత్య కుమార్ యాదవ్ పై దాడికి పాల్పడిన ఘటనలో బోరుగడ్డ అనిల్ కుమార్ అనే వ్యక్తి ఆరోగ్య శాఖ మంత్రికి ఫోన్ చేసి చంపుతానని బెదిరించారనే ఆరోపణలపై ఎస్పీకి ఫిర్యాదు చేసిన బీజేపీ యువమోర్చా మాజీ జాతీయ కార్యదర్శి బోరుగడ్డ అనిల్, నందిగం సురేష్ అనుచరులు సత్య కుమార్ పై అసభ్యకరమైన మాటలతో అమరావతి రైతులకు మద్దత్తు ఇస్తావా అంటూ ఇనుప రాడ్లు రాళ్లతో దాడి చేసి సత్య కుమార్ కారును ధ్వంసం చేసి వైసీపీ నినాదాలతో దాడులకు దిగారు దళిత నాయకుడిగా ఉన్న నాపైనే దాడులకు దిగడం అమానుషం అని అన్నారు. నందిగం సురేష్, బోరుగడ్డ అనిల్ ఇష్టాను సారంగా మీడియా ముందు మాట్లాడటం చూస్తే సిగ్గనిపించింది తుళ్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి వెళితే కేసు నమోదు చేయని పరిస్థితి నాటి వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన సంగతి గుర్తు చేశారు. ఇప్పట్టికైనా పోలీసుల చర్యలు తీసుకోకపోతే డిజిపికి సైతం



ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. సత్య కుమార్ యాదవ్ పై హత్యాయత్నానికి పాల్పడిన బోరుగడ్డ అనిల్ మరియు వారి అనుచరులపై కేసు నమోదు చేయాలి ఆని ఎస్పీకి ఫిర్యాదు చేయడం జరిగింది. బోరుగడ్డ అనిల్ లాంటి సంఘ విద్రోహశక్తులు దళిత కార్డు ముసుగులో ఇతర పార్టీల నాయకులపైన బిజెపి జాతీయ కార్యదర్శి ప్రస్తుత ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పైన మరియ కుటుంబ సభ్యుల పైన మాట్లాడినటువంటి భాష మాకు చేతకాక కాదు భారతీయ జనతా పార్టీలో ఆ సాంప్రదాయం మాకు నేర్పియలేదు. బోరుగడ్డ అనిల్ చేత మాట్లాడిన మాట్లాడించినటువంటి జగన్మోహన్ రెడ్డి ధైర్యం ఉంటే బోరుగడ్డ అనిల్ ను పరామర్శించగలడా బోరుగడ్డ అనిల్ పైన శాశ్వతంగా రౌడీషీట్ ఓపెన్ చేయాలి ఆని దళిత ముసుగులో ఇలాంటి వారిని అడ్డుపెట్టుకుని రాజకీయం చేసే జగన్మోహన్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి లను రాజకీయల నుంచి బహిష్కరించాలని సురేష్ డిమాండ్ చేశారు. బోరుగడ్డ అనిల్ మాట్లాడే బాష చూసి దళిత సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా ఉంది బోరుగడ్డ అనీల్ ను సమాజం నుంచి బహిష్కరించాలని ముక్తకంఠంతో చెబుతుంది.భారతీయ జనతా పార్టీల నాయకులు కార్యకర్తల పట్ల ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసిన తగిన గుణపాఠం చెపుతామని వైసిపి గుండాలను హెచ్చరించడం జరిగింది. ఎస్పీ సతీష్ కుమార్ ఫిర్యాదు తీసుకొని పరిశీలించి వారిపైన తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది.

## పందుల పెంపకం వల్ల పరిసరాల ప్రజలకు

# అనేక రోగాలు



ఎమ్మిగనూరు, అక్టోబరు 21 ,(ఆంధ్ర పత్రిక) : పట్టణంలోని 24 వ వార్డు లక్ష్మీపేట ఓఇంటి నందు పందులు పెంపకం వల్ల దుర్వాసనతో వెదజల్లు నున్న ఆ పరిసరాల ప్రజలకు అనేక రోగాలు బారున పడే ప్రమాదం ఉందని సిపిఎం జిల్లా నాయకులు గోవిందు. సురేష్ వార్డు ప్రజలు బందేనవాజ్ లు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మీపేట, ఇంటి నెంబర్: 5-1284-1- పందుల పెంపకం వల్ల దుర్గంధంతో వ్యాధులు రాకుండా ప్రజలను కాపాడాలి. వెంటనే పెంపకం దారులను మందలించి ఖాళీ చేయించి ప్రజలు రోగాల బారున పడకుండా ముందస్తు జాగ్రత్తగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. కాలి స్థలం బురదకుంటగా మారి అక్కడికి దోమలు క్రిమి కీటకాలు, పాములు చేరుతున్నాయి. మురికి కుంట వల్ల దోమలు వృద్ధి చెంది దోమల కాటు వల్ల ప్రజలకు, చిన్న పిల్లలకు డెంగ్యూ, మలేరియా, మెదడువాపు వ్యాధి ప్రభులే ప్రమాదం ఉందన్నారు.ఇప్పటికే స్వయం ఫ్లూ, డెంగ్యూ, మలేరియా జ్వరాలు వచ్చి పిల్లలు, వృద్ధులు ఆసుపత్రుల పాలయ్యారు. ఈ సమస్య వల్ల చుట్టుపక్కల ఉన్నటువంటి ప్రజలు మానసికంగా, అనారోగ్య సమస్యలను భరించలేక పోతున్నారన్నారు. గతంలో ఈ సమస్య మున్సిపాలిటీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురి కాకుండా కాపాడాలని అధికారులను కోరారు. ఈకార్యక్రమంలో స్థానిక వార్డు ప్రజలు, శ్రీనివాసులు, నరసింహులు, గోపాలు, నాగరాజు, పాల్గొన్నారు.

# ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి పట్టుదలతో పనిచేస్తున్నా



ఆత్మకూరు,అక్టోబరు 21 ,(ఆంధ్ర పత్రిక) : ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి పట్టుదలతో పనిచేస్తున్నానని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉదయం నెల్లూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని నాయకులతో మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో తన హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప గత ప్రభుత్వం చేసిందేమి లేదని, మళ్లీ ఆత్మకూరు అభివృద్ధిని పట్టాలెక్కించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు మంత్రి అన్నారు. ఆత్మకూరు పట్టణాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు స్థానిక నాయకులు, ప్రజలు భాగస్వామ్యం కావాలని మంత్రి పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై యాక్షన్ ప్లాన్ తయారుచేస్తున్నామని పేర్కొన్న మంత్రి, ఒక్కొక్కటిగా పూర్తి చేస్తామని చెప్పారు. పట్టణంలో ఎల్ఈడి లైట్లు, అన్నివార్డుల్లో సీసీ రోడ్లు, సైడు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, ప్రాధాన్యతక్రమంలో పనులు చేపడ్తామన్నారు. 9 కోట్లతో తాగునీటి స్కీంను పనులు చేపట్టామని, దీంతో ఆత్మకూరు ప్రజల దాహార్తి శాశ్వతంగా తీరనుందన్నారు. ఆత్మకూరు సమీపంలోని టిడ్కో ఇళ్లల్లో అన్ని సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి చెప్పారు. ఆత్మకూరు పట్టణంలో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, అన్ని వార్డుల్లో ఆకస్మికంగా తనిఖీలు చేస్తానని, ఎవరైనా పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం చూపితే వెంటనే సస్పెండ్ చేస్తామన్నారు. త్వరలో ఆత్మకూరులో బీసీ బాలికల రెసిడెన్షియల్ కళాశాలను, ఆర్ అండ్ బి అతిథిగృహాలను ఆయాశాలఖ మంత్రులతో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు.

**గడిచిన ఐదేళ్లలో ఆత్మకూరులో అభివృద్ధి ఊసే లేదు**

**మళ్లీ ఆత్మకూరు అభివృద్ధిని అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా-**

**ప్రత్యేక కార్యాచరణతో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**ప్రతిఒక్కరూ కూడా ఆత్మకూరు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి**

**మంత్రిఆనం రామనారాయణరెడ్డి**



తహశీల్దారు కార్యాలయం కూడా పూర్తికావచ్చిందన్న మంత్రి, త్వరలోనే నూతన షాదీ మంజిల్ నిర్మాణానికి చర్యలు చేపడ్తామన్నారు. పట్టణంలోని అన్ని రోడ్లను ఆధునీకరిస్తామన్నారు. పార్కుల అభివృద్ధి, ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు చర్యలు చేపడ్తామన్నారు. ఆత్మకూరు పట్టణంలో చేపట్టనున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక నాయకులందరూ భాగస్వామ్యమై తమ వంతు సహకారం అందించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ పరిశీలకులు సుఖవాసి శ్రీనివాస్, సభ్యత్వ నమోదు పరిశీలకులు కార్తీక్, స్థానిక నాయకులు బొల్లినేని గిరినాయుడు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఆత్మకూరు పట్టణ నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా

# ఉదారంగా ఆర్థిక సాయం

**మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

**26మంది లబ్ధిదారులకు రూ.16.58 లక్షల చెక్కులు పంపిణీ**



ఆత్మకూరు ,అక్టోబరు 21 ,(ఆంధ్ర పత్రిక) : వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ఫండ్ ద్వారా ఉదారంగా ఆర్థికసాయం అందించి అండగా ఉంటున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు నియోజక వర్గ పరిధిలోని 26 మంది లబ్ధిదారులకు రూ. 16.55 లక్షలు విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చెక్కులు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఆసరాగా, ఇంటి పెద్దగా వుంటూ పెద్దఎత్తున సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం చేస్తున్న మానవతావాది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని మంత్రి కొనియాడారు. బాధితులందరి తరపున ముఖ్యమంత్రికి మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్‌డిఎ ప్రభుత్వంలో ఏ ఒక్కరూ కూడా ఇబ్బందులుపడకూడదనే ఉద్దేశంతోనే ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

# ఎట్టకేలకు ఎంబి చర్చి రోడ్డు నిర్మాణా పనులు ప్రారంభం

ఎమ్మిగనూరు. అక్టోబర్ 21 (ఆంధ్ర పత్రిక) ఎట్టకేలకు ఎంబి ఎరుషాలేం చర్చ నుంచి ఖబర్ స్తాన్ రోడ్డు నిర్మాణా పనులను సోమవారం ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి. స్థానిక ఎస్సీ కాలనీ టిడిపి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సీ టిడిపి నాయకులు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా రోడ్డు నిర్మాణా పనులు కోసం దళితులు ఎదురుచూస్తున్న కల సాకారం అయ్యిందని ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేశారు.గత ఐదేళ్లు పాలించిన పాలకులు ఎస్సీ కాలనీ అభివృద్ధిని విస్మరించారని ఎద్దేవా చేశారు . వైసీపీ నేతలు దళితులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు పనులు చేపట్టామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఇచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ బి వి జయ నాగేశ్వర్ రెడ్డి గా నేడు నెరవేర్చారన్నారు. ఎస్సీ కాలనీ వాసులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.శాలేం, 7వ వార్డ్ కౌన్సిలర్ శ్రీమతి ఎరుకుల సుంకమ్మ కుమారుడు ఎరుకుల సూర్యనారాయణ,ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు నీళ్లు ఇచ్చిన చరిత్ర చంద్రబాబుదే



బుక్కపట్నం,అక్టోబరు 21 ,(ఆంధ్ర పత్రిక) :కరువు ప్రాంతమైన రాయలసీమ జిల్లాల్లోని చెరువులకు నీళు ఇచ్చిన చరిత్ర ముఖ్యమంత్రి చంద్రబాబుదని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కొనియాడారు.పుట్టపర్తి నియోజకవర్గంలోని బుక్కపట్నం మండలం మారాల రిజర్వాయర్ కు హంద్రీ నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తోపాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి విడుదల చేశారు.సోమవారం నీటి విడుదలకు బుక్కపట్నం మండలానికి విచ్చేసిన ఎమ్మెల్యే,మాజీ మంత్రి లకు వందలాది మంది రైతులు,స్థానికులు పూల వర్షం కురిపిస్తూ టపాసులు కాల్చి అపూర్వ స్వాగతం పలికారు.హంద్రీ నీవా కాలువ నుంచి వచ్చే కృష్ణా జలాలను మారాల రిజర్వాయర్ కు ఎమ్మెల్యే నీటిని విడుదల చేసి గంగకు పూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ...గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులకు ఒక చుక్క నీరు విడుదల చేసింది లేదన్నారు.గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతులకు చేసింది శూన్యం అన్నారు.గత వైసీపీ పాలన నియోజకవర్గంలో అప్పటి వైసిపి ఎమ్మెల్యేగా ఉన్న శ్రీధర్ రెడ్డి రైతులను ఏనాడు పట్టించుకోలేదని గుర్తు చేశారు.ఎన్నికల అప్పుడు మాత్రమే వైసిపికి రైతులు గురించి,చెరువులు నింపాలనే ఆలోచన వస్తుంది తప్ప ఏనాడు ఆచరణలో అమలు చేయలేదన్నారు.తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు మాసాల్లోనే పుట్టపర్తి నియోజకవర్గంలోని బుక్కపట్నం మారాల రిజర్వాయర్ కు నీటిని అందించే కార్యక్రమం చేపట్టామని తెలిపారు.ఎమ్మెల్యేగా చెరువులకు నీళ్లు ఇచ్చే

**మరాల డ్యాంకి కృష్ణా జలాలు విడుదల చేసిన ఎమ్మెల్యే**

**అన్నం పెట్టే అన్నదాతను ఆదుకోవాలన్నదే టీడీపీ ప్రభుత్వ ధ్యేయం**

**పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



కార్యక్రమం నా ద్వారా ఈరోజు చేస్తున్నందుకు ఎంతో గర్వపడుతున్నాను.ఎంతో సంతోషిస్తున్నాము.పది మందికి అన్నం పెట్టే రైతన్నను ఆదుకోవాలనే సంకల్పం ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈరోజు చెరువులకు నీళ్లు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.పంట సాగుచేసే ప్రతి రైతన్న కు మీ ఎమ్మెల్యేగా,మీ బిడ్డగా శిరస్సు వంచి వందనాలు తెలుపుకుంటున్నాను.ఏ రైతుకు కష్టం వచ్చినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.నాపై నమ్మకం ఉంచి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించిన ఈ ప్రాంత ప్రజలకు,ఈ ప్రాంత రైతాంగానికి ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా నిలబడి రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని ఆమె తెలిపారు.ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలోని 195 చెరువులను నింపే బాధ్యత తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు.ఇది మా మామ మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చిరకాల కోరిక అన్నారు.

## అక్టోబరు 30న శ్రీ కోదండరామస్వామివారి

# ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి ,అక్టోబరు 21 ,(ఆంధ్ర పత్రిక) : తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో అక్టోబర్ 30వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆలయంలో అక్టోబర్ 31వ తేదీ దీపావళి ఆస్థానం సందర్భంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉదయం 7 నుండి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రమిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను ఉదయం 11 గంటల నుండి దర్శనానికి అనుమతిస్తారు. దీపావళి ఆస్థానం దీపావళి సందర్భంగా అక్టోబరు 31వ తేదీ రాత్రి 7 గంటలకు తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారి ఆలయం నుండి నూతన వస్త్రాలు, దోశపడి, దీపాలు తీసుకువచ్చి శ్రీకోదండరామస్వామివారికి సమర్పించనున్నారు. ఈ సందర్భంగా అమావాస్యనాడు ఆలయంలో నిర్వహించే సహస్ర కలశాభిషేకంసేవ, హనుమంత వాహనసేవను టిటిడి రద్దు చేసింది.

# విద్యార్థిని దస్తగిరమ్మ మృతి బాధాకరం

బద్వేలు అక్టోబరు 21 ,(ఆంధ్ర పత్రిక) : బద్వేలు గోపవరం మండలం సెచిరియన్ పరిశ్రమ అటవీ ప్రాంతంలో పెట్రోల్ దాడికి గురైన ఇంటర్ విద్యార్థిని దస్తగిరమ్మ కడప రిమ్స్ హాస్పిటల్లో మృతి చెందిన విషయం తన మనసును కలచివేసిందని ఈ స0ఘటనపే తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా ఎస్.పితో మాట్లాడి నిందితుని తక్షణమే అరెస్ట్ చేయాలనీ అదేశిచడం 24గంటలలోనే నిందితుడిని అదుపులోకి తీసుకడం జరిగింది.

ఈ విషయాన్ని రాజకీయం చేయడం తగదని టీడీపీ పార్టీ బాద్యులు రితిష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయడం అంటే నిందితుడు విగ్నేష్,అతనికి సహకరించిన వారికి త్వరగా శిక్షపడేలా విచారణ త్వరగా పూర్తిచేయాలని,నిందితుడు విగ్నేష్ కి మరణశిక్ష స్థాయిలో శిక్షపడేలా హొంమంత్రి వలగపూడి అనిత జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు ఆదేశాలు జారీ చేయాలని దస్తగిరమ్మ కుటుంబానికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేశారు.

ఇలాంటి దుర్చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా భయపడేలా శిక్షలు ఉండాలని, విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలని,విద్యార్థిని దస్తగిరమ్మ ఆత్మకు శాంతి కలగాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రితిష్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో బద్వేలు టిడిపి పట్టణ అధ్యక్షుడు గురంపాటి వెంగలరెడ్డి టీడీపీ రూరల్ అధ్యక్షుడు బసిరెడ్డి రవికుమార్ మాజీ మైనారిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా (బిగ్ బాస్) మాజీ మునిసిపల్ చైర్మెన్ పార్థ సారథి తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు జహగిర్ బాషా తెలుగు మహిళ అధ్యక్షురాలు మాచు పల్లి లక్షిమ్మిదేవి తెలుగు యువత నాయకులు శ్రీకాంత్ హరి గోపవరం మండలం వైస్ ఎంపీపీ రాంమోహన్ రెడ్డి అట్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**టీడీపీ బాద్యులు రితేష్ రెడ్డి కూటమి అభ్యర్థి బొజ్జ రోషన్న**



## చంద్రగిరి శ్రీ కోదండరామాలయంలో

# పవిత్రోత్సవాలకు శా స్త్రోక్తంగా అంకురార్పణ

చంద్రగిరి, అక్టోబరు 21 ,(ఆంధ్రపత్రిక) : చంద్రగిరి శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో అక్టోబరు 22 నుండి 24వ తేదీ వరకు జరుగనున్న పవిత్రోత్సవాలకు సోమవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు.

ఇందులో భాగంగా సాయంత్రం 6 నుండి సేనాధిపతి ఉత్సవం, మృత్సంగ్రహణం, రక్షాబంధనం, మేదినిపూజ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. అక్టోబరు 22వ తేదీ మంగళవారం ఉదయం చతుష్టానార్చన, పవిత్రప్రతిష్ఠ, సాయంత్రం పవిత్ర హెూమాలు జరుగనున్నాయి.

అక్టోబరు 23న బుధవారం ఉదయం పవిత్ర సమర్పణ, హెూమాలు, సాయంత్రం పవిత్ర హవనం, చతుష్టానార్చన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అక్టోబరు 24న గురువారం ఉదయం పవిత్ర విసర్జన, కుంభప్రోక్షణ, సాయంత్రం వీధి ఉత్సవం జరుగనున్నాయి. గృహస్తులు(ఇద్దరు) రూ.200/- చెల్లించి పవిత్రోత్సవాల ఆర్జితసేవలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక పవిత్రమాల, తీర్థప్రసాదం బహుమానంగా అందజేస్తారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరిబాబు, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రమాద వశాత్తు లోయలో పడి చిరుత మృతి

## జిల్లా అటవీశాఖ అధికారిని ఎస్.భరణి





**సోమల.. అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక) :** చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సోమ ల మండలంలో అటవీ ప్రాంతం లో ప్రమాద వశాత్తు 12 అడుగుల లోతులో పడి చిరుత పులి మరణించిన సంఘటన చోటు చేసుకుంది.అటవీశాఖ అధికారుల వివరాల మేరకు సోమల మండలం 81 చిన్న ఉప్పర పల్లి ,గట్టువారిపల్లి సమీపంలో గల చెరువు కో న అట వి ప్రాంతంలో పశువుల కాపర్లు మేకలుమేపే వారు మే త కొరకు వెళ్లేవారు ఈ క్రమంలో వారికి లోతైన లోయలో చిరుత పులిని పడి ఉండడాన్ని గమనించి వెళ్లి చూసిన చనిపోయి ఉండడాన్ని గమనించారు ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు సమాచారం అందుకున్న చిత్తూరు జిల్లా అధికారి ఎస్ భరణి మరియు పుంగనూరు రేంజర్ శ్రీరాములు మరియు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు .చిరుత ను పరిశీలించిన తర్వాత తిరుపతి జూ పార్క్ నుండి పశు వైద్య అధికారుల బృందం కు సమాచారం అందించారు వారు సాయంత్రం సంఘటన స్థలానికి చేరుకున్నారు చనిపోయినటువంటి పులిని పరిశీలించారు పులిని గ్రామస్తులు వి



ఎస్ ఎస్ వాలంటీర్లు, వీఆర్వో శివకుమార్ సమక్షంలో పంచనామా నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ చిరుత పులి చనిపోయి రెండు మూడు రోజులు అయి ఉండవచ్చు అని తెలిపారు ఈ వర్షం కారణంగా పైనుంచి పడిన తర్వాత తలకు బలమైన గాయం తగిలిందని తెలియజేశారు అలాగే వర్షం కారణంగా ఎవరు ఇటువైపు రాకపోవడంతో పులి విషయం తెలియ రాలేదని తెలిపారు. పంచనామ తర్వాత పులి కల్చినట్లు తెలిపారు.పులి శరీరంలోని ముఖ్య అవయవాలను తిరుపతి ఫోర్ సెనిక్ ల్యాబ్ కు తరలించారు ల్యాబ్ రిపోర్టు అందిన తర్వాత మిగిలిన విషయాలు తెలియజేస్తామని ఎస్.భరణి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఎస్ ఓ ఎస్ ఇంద్రాణి, ఆ వులపల్లి ఎఫ్ బి ఓ షాజహాన్ మహేష్, ఈ ఎస్ ఎస్ సభ్యులు రమణ గురుస్వామి అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### డిపిఓ సారు ఓసారి టౌన్‌లో

# పర్యటించరాదే..

**రేణిగుంటలో పడకేసిన పారిశుధ్యం.....**

**చోద్యం చూస్తున్న పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది తీరు...**

**ఆటకెక్కిన శానిటేషన్ పనులు......**

**క్షేత్రస్థాయిలో అధికారులు వార్డు పర్యటనలు లేవు....**





**రేణిగుంట: అక్టోబర్ 21, (ఆంధ్రపత్రిక) :** రేణిగుంట బుగ్గ వీధి వినాయక నగర్, పాంచాలి నగర్ల లలో ఎక్కడపడితే అక్కడ కుప్పలు తేప్పులుగా చెత్త చెదారంతో నిండి దుర్వాసన పెద్ద జల్లుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయితీ శానిటేషన్ కోసం ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చిస్తూ ఉంటే అధికారులు మాత్రం నిద్రవస్థలో జోగుతున్నారు. శానిటేషన్ సిబ్బందితో పని చేయించ లేకపోవడం దురదృష్టకరం.. ప్రతిరోజు ఆనవాయితీగా చెత్తను ఎత్తకపోవడం వారం రోజులకు ఒకసారి గా ట్రాక్టర్ తో రావడం చెత్తను సేకరించి తీసుకుపోవడం తప్ప కనీసం రెండు రోజులకు ఒకసారి కూడా కాల్వాలు పూడిక తీయకపోవడం, ఎంతో శోచనీయం.. ప్రజా ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన పంచాయతీ సిబ్బంది చోద్యం చూస్తుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఓ పక్క డెంగ్యూ, విష జ్వరాలతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎం, ఆశాలు ఇంటింటి, ఫీవర్ సర్వే వంటివి చేయకుండా, చోద్యం చూస్తున్నారననే వాదన వినపడుతూ ఉంది. ఓ పక్క ప్రైవేటు ఆసుపత్రి చుట్టూ తిరుగుతూ పేద ప్రజలు జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వార్డులలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పారిశుధ్య పనులను చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.

## అంగరంగ వైభవంగా పల్లె పండగ కార్యక్రమం



**కల్లూరు ,అక్టోబర్ 21(ఆంధ్రపత్రిక) :** గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రభుత్వ ఆశయమని పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి అన్నారు .పులిచెర్ల మండలం యర్రమ వాండ్లపల్లి,పులిచెర్ల లో ఆదివారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి చల్లా రామచంద్ర రెడ్డి పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. యర్రంవాండ్ల పల్లెకి విచ్చేసిన చల్లా రామచంద్రారెడ్డికి టిడిపి నాయకులు బండ్ల రమేష్, మహేష్, బండ్ల కిరణ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు కనీ విని ఎరుగని రీతిలో మంగళ వాయిద్యాలు మహిళలు, కర్పూర హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జయసింహ, ఎంపీడీవో రాజశేఖర్ బాబు ఏపీ డి శ్రీనివాసులు, ఏపీఓ షౌకత్ అలీ, మాజీ జడ్పిటిసిలు రామనాథం నాయుడు, మురళీధర్ సర్పంచ్ రాణి, టిడిపి నాయకులు కుమార్ రెడ్డి , ముల్లంగి వెంకటరమణ ,లెక్కల ధనుంజయ నాయుడు, మురళి నాయుడు,, సుబ్బారెడ్డి, నజీర్, సదాశివరెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుపతి ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా మురళి ఎన్నిక..





**తిరుపతి: అక్టోబర్ 21, (ఆంధ్రపత్రిక) :** తిరుపతి ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఆర్ మురళి ఎన్నికయ్యారు. అక్టోబర్ 20వ తేదీ జరిగిన ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో తిరుపతి ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డారు. మితవాది అందరికీ వాడు, అందుబాటులో ఉండే నేతగా సభ్యులు గుర్తించి ఆయనను అఖండ మెజారిటీతో గెలిపించుకున్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా పోటీలో నిలుచున్న జగదీష్ కు 24 ఓట్లు సుధీర్ కు 140 ఓట్లు రాగా మురళికి 351 ఓట్లు పోలయ్యాయి. చెల్లని రెండు ఓట్లు, మొత్తం ఓట్ల సంఖ్య 517. ఓట్లు పోలయ్యాయి. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ జర్నలిస్ట్ ల సంక్షేమానికి, వారి కుటుంబాలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని అలాగే తన వంతు జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు ఆరోగ్య, మరియు యాక్సిడెంట్ భీమా సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఎంతో పేరు ప్రతిష్టలు కలిగిన తిరుపతి ప్రెస్ క్లబ్ ఔన్నత్యాన్ని నిలబెడతానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు..

### అర్ అండ్ బి స్థలాలను

# ఆక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవు

**– అర్ అండ్ బి ఈ. ఈ రామాంజనేయులు.**



**గూడూరు అక్టోబర్ 21, (ఆంధ్రపత్రిక) :** గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు లోని కట్టాలమ్మ దేవస్థానం వద్ద ఉన్న బస్ షెల్టర్ సమీపాన అర్. అండ్. బి స్థలాన్ని కబ్జా చేసి చదును చేసి మట్టిని పోసి ఆక్రమించాడు.దీనితో అర్. అండ్. బి ఈ ఈ రామాంజనేయులు దృష్టికి తీసుకు వెళ్లగా , సోమవారం ఆక్రమణను తొలగించారు. ఈ సందర్భంగా అర్. అండ్. బి ఈ .ఈ రామాంజనేయులు మాట్లాడుతూ ఎవరైనా అర్. అండ్. బి స్థలాలను అక్రమిస్తే చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనితో సి.పి. ఎం నియోజక వర్గ ఇన్చార్జి శ్రీనివాసులు , చెన్నూరు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం ఆర్. అండ్. బి ఈఈ కి ధన్యవాదాలు తెలిపారు.

## గ్లోబల్ ఎడుకేషన్ ఎక్సెలెన్స్ -2024

### అవార్డు గ్రహీత.. గౌతమీస్ ఆక్స్‌ఫర్డ్ మోడల్ స్కూల్..



**రేణిగుంట: అక్టోబర్ 21,(ఆంధ్ర పత్రిక) :** గ్లోబల్ ట్రంయంప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ ఎడుకేషన్ సమ్మిట్ - 2024 ఉత్తమ అవార్డు గ్రహీత గా ఎంపిక అయిన విద్యాసంస్థ తిరుపతి జిల్లా లోని రేణిగుంట లో గల ఏకైక విద్యాసంస్థ గౌతమీస్ ఆక్సఫర్డ్ మోడల్ స్కూల్. ఇంతటి ఉత్తమ అవార్డు నీ మన స్కూల్ ప్రిన్సిపల్ గౌతమి మురళీకృష్ణ అందుకోవడం జరిగింది. అవార్డు గ్రహీత ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇంతటి గొప్ప ఎడుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు అందుకోవడానికి సహకరించిన స్కూల్ ఉపాద్యాయులు మరియు తల్లి దండ్రులు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నానని ఆమె అన్నారు..

### అభిషేక ప్రియుడు మృత్యుంజయశ్వర స్వామి ఆలయంలో

# విశేష పూజలు



**చౌడేపల్లి,అక్టోబర్21(ఆంధ్రపత్రిక) :** స్థానిక మృతుంజేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. అభిషేక ప్రియుడు అయిన మృత్యుంజయశ్వర స్వామి ఆలయంలో ప్రధానార్చకుడు రాజశేఖర్ దీక్షితులు, కుమారస్వామి, మహేష్ ల ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు గావించారు. రాష్ట్రం నుంచి కాకుండా తమిళనాడు, కర్ణాటక, నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి అర్చన అభిషేక పూజల్లో పాల్గొన్నారు. వారికి పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు.

## కరణం వారి పల్లిలో చిరుత సంచారం...?

### – భయం గుప్పిట్లో గ్రామస్తులు



**చౌడేపల్లి,అక్టోబర్21(ఆంధ్రపత్రిక) :** మండలంలోని కాగతి పంచాయతీ కరణం వారిపల్లిలో చిరుత సంచరిస్తున్నట్లుగా గ్రామస్తులు గుర్తించి భయాందోళన చెబుతున్నారు. గ్రామంలోని రాజమ్మ, అనే మహిళ సోమవారం తెల్లవారుజామున గ్రామానికి సమీపంలోని తమ బోరుబావి వద్దకు వెళ్ళింది. ఓ మామిడి తోటలో చిరుత సంచరిస్తున్నట్లుగా అడుగులు ఉండడంతో గట్టిగా కేకలు వేసింది. వెంటనే గ్రామస్తులు తోటలోకి వెళ్లి చూడగా చిరుత దాని పిల్ల అడుగుజాడలు కనిపించాయి. దీంతో కరణం వారిపల్లి గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు ఏ బి ఓ రామయ్య, ఎఫ్బి ఓ యువరాజులు, సంఘటన స్థలాన్ని



చేరుకున్నారు. ఆ అడుగులు చిరుతవి కాదని హైనా లేకుంటే రేసు కుక్క అడుగులని వారు గ్రామస్తులకు తెలియజేశారు. దీంతో గ్రామస్తులు అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

### ఘనంగా డాక్టర్ జనార్ధన్ రెడ్డి

# పుట్టినరోజు వేడుకలు



**గూడూరు అక్టోబర్ 21, (ఆంధ్రపత్రిక)** ప్రముఖ ప్రజా డాక్టర్ జనార్ధన్ రెడ్డి , 70వ జన్మదిన వేడుకలు సింహపురి రెడ్డి సంక్షేమ సంఘ సభ్యుల సమక్షం లో ఘనంగా జరిగినాయి. ఈ సందర్భంగా పలువు రు మాట్లాడుతూ పేదల డాక్టర్‌గా పేరు పొందారు అన్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ఆయన ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు అన్నారు. ఆయన భవిష్యత్ లో మరెన్నో జన్మ దిన వేడుకలు జరుపుకోవాలని కోరుకుంటున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో సనత్ కుమార్ రెడ్డి, బండి ధనంజయ రెడ్డి, నెలబల్లి సిద్ధారెడ్డి, ప్రజెంద్ర రెడ్డి, మూలి హరనాథ్ రెడ్డి, ఆమంచెర్ల భాస్కర్ రెడ్డి, కిషోర్ రెడ్డి, రాధాకృష్ణ రెడ్డి, హరనాథ్ రెడ్డి ,కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పండుగ -ప్రగతికి అండ కార్యక్రమం



**బంగారుపాళ్యం-పుంగనూరు-అక్టోబర్ 21(ఆంధ్రపత్రిక)..** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు పల్లె పండుగ -ప్రగతికి అండగ కార్యక్రమంలో భాగంగా పుంగనూరు నియోజకవర్గం,పుంగనూరు మండల అధికారులు,కూటమి నాయకుల ఆధ్వర్యంలో సోమవారం “పల్లె పండుగ -పంచాయతీ వారోత్సవాలు” ఘనంగా నిర్వహించారు మండలంలోని భీమగానిపల్లి పంచాయితి,బోనేపల్లి, ఏతురు పంచాయతీ నల్లగుట్లపల్లి,మాగండ్లపల్లి పంచాయితి,బర్నేపల్లి, సింగిరిగుంట పంచాయితి, మార్లపల్లి లో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో టీడీపి మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, జనసేన జిల్లా కార్యదర్శి పగడాల రమణ,పోగ్రామ్స్ సెక్రటరీ చైతన్య రాయల్, నరేష్ రాయల్,గంగాధర్,సుబ్బు,కూటమి నాయకులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ మల్లేశ్వర స్వామికి విశేష పూజలు



**కల్లూరు అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక) :** పులిచెర్లమండలం జాంద్రపేట శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కి విశేష పూజలు నిర్వహించారు. ఆలయం లో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు ,పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# అసెంబ్లీ సమావేశాలకు రండి..

(మొదటిపేజీ తరువాయి)

పంచాయతీ వారోత్సవాల్లో పాల్గొన్నారు.నాతవరం మండలం పెద్దగొలు గుండపేటలో జరిగిన ఈ కార్యక్రమంలో అయ్యన్న పాత్రుడు రూ.1.4 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అసెంబ్లీ సమావేశాలకు రావాలని జగన్‌ను ఆహ్వా నిస్తున్నానని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో ఇద్దరం ముచ్చటించుకుందాం అని పేర్కొన్నారు. ఇక నియోజకవర్గం గురించి మాట్లాడుతూ, నర్సీపట్నంకు 100 రోజుల్లో రూ.40 కోట్లు తీసుకు వచ్చానని వెల్లడించారు. నాతవరం మండలానికి భారీగా నిధులు కేటాయించామని, తాండవ గేటు మరమ్మతు పనులు పూర్తి చేయించామని అయ్యన్నపాత్రుడు వివరించారు. పంట సీజన్ ప్రారంభమైన వెంటనే కొత్త గేటు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు.

# తిరుమల ఆలయ పరిసరాల్లో హెలికాప్టర్ చక్కర్లు

(మొదటిపేజీ తరువాయి)

విరుద్ధం. తిరుమల పుణ్యక్షేత్రాన్ని నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాలని టీటీడీ అనేకసార్లు కోరిన, కేంద్ర విమానయాన శాఖ నేటికీ స్పందించట్లేదు.తిరుమలలో హెలికాప్టర్ చక్కర్లు కొట్టడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుపై టిటిడి యంత్రాగం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

# వైఎస్ఆర్ ఆశయాలు గుర్తులేవా..

(మొదటిపేజీ తరువాయి)

పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ఘాటు విమర్శలు చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన జీవితం మొ త్తం మత పిచ్చి బీజేపీనీ వ్యతిరేకిస్తే.. అదే బీజేపీకి జగన్ దత్తపుత్రుడు అయ్యాడని షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమ వారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ షర్మిల మీడియా సమావేశంలో వైసీపీ అధినేత జగన్‌పై వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపీతో చెట్టాపట్టాలు వేసుకుని మోదీ వారసుడు జగన్ తిరిగారని ఆరోపించారు. అలాంటి వాళ్లకు వైఎస్సార్ ఆశయాలు గుర్తుకు ఉంటాయని అనుకోవడం, ఆశయాలకు వారసులు అవుతారనడం పొర పాటేనని విమర్శించారు. వైఎస్సార్ మానస పుత్రిక ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అని గుర్తుచేశారు. నాడు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వైఎస్సార్ అద్భుతంగా అమలు చేస్తే.. సొంత కొడుకైన జగన్ మోహన్ రెడ్డి తన హయాంలో పథకాన్ని నీరు గార్చారని ధ్వజమెత్తారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులు రూ.3500 కోట్లు పెండింగ్ పెట్టడం నిజంగా సిగ్గుచేటు అని షర్మిల అన్నారు. కాయిలు చెల్లించకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడారని విమర్శించారు. తల్లిదండ్రులను మనోవేదనకు గురి చేశారని చెప్పారు. దోచుకొని దాచుకోవడం మీద ఉన్న శ్రద్ధ, విద్యార్థుల సంక్షేమం మీద వైసీపీ ప్రభుత్వం పెట్టలేదని విమర్శించారు. నాడు జగన్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగార్చి నిర్వీర్యం చేయాలని చూస్తే.. నేడు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వైఎస్ షర్మిల ఆరోపించారు.వైసీపీ చేసింది మహా పాపమైతే.. కూటమి సర్కారు విద్యార్థులకు పెడుతున్నది శాపమని విమర్శలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని సీఎం చంద్రబాబును కోరారు. బకాయిలు ఎవరు పెండింగ్‌లో పెట్టినా.. అవి విడుదల చేసే బాధ్యత ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై ఉందని తెలిపారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, పథకానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని షర్మిల డిమాండ్ చేశారు.

# దూసుకొస్తున్న 'డానా' తుఫాన్..!

(మొదటిపేజీ తరువాయి)

వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఏపీలోని కోస్తాంధ్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్, అసోం, త్రిపుర, మిజోరాం, మేఘాలయలో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. అంతేకాకుండా ఒడిశా, బెంగాల్ రాష్ట్రాల్లో రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అధికారులు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది.భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు. ముందుగా అన్ని సన్నాహాలు చేస్తున్నట్లు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు స్పష్టం చేశాయి. ఫైర్ సర్వీస్, శాంతిభద్రతల అదనపు డీజీతో సమీక్ష నిర్వహిస్తామని ఒడిశా రెవెన్యూ విపత్తు నిర్వహణ మంత్రి సురేష్ పూజారి తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సహాయక కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని.. కేంద్రప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు మంత్రి తెలిపారు.

# ప్రపంచానికి ఆశాకిరణంగా భారత్

(మొదటిపేజీ తరువాయి)

దేశంలో 'భారత్ శతాబ్ది' గురించి ఆలోచిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. ఆయన 'ది ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్'లో ప్రారంభోపన్యాసం చేశారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణంలా కనిపిస్తోందన్నారు. దేశం ప్రతి రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని అభివర్ణించారు. 'మా ప్రభుత్వం ఇప్పటికే 125 రోజులు పూర్తి చేసుకొంది. ఈ కాలంలో మా ప్రభుత్వ అనుభవాన్ని మీతో పంచుకుంటాను. పేదలకు 3 కోట్ల కొత్త పక్కా గృహాలు ఇచ్చాం. రూ.9 లక్షల కోట్ల ఇన్ఫ్రా ప్రాజెక్టులపై పని మొదలైంది. 15 వందేభారత్ రైళ్లు ప్రారంభించాం. 8 కొత్త ఎయిర్ పోర్టుల పనికి శ్రీకారం చుట్టాం. యువతకు రూ.2లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ ఇచ్చాం. రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్లను బదిలీ చేశాం. 70 ఏళ్లు దాటిన వృద్ధులకు ఉచిత వైద్యానికి ఏర్పాట్లు చేశాం. 5 లక్షల ఇళ్లలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేశాం. స్టాక్‌మార్కెట్ సూచీల్లో దాదాపు 7 శాతం వృద్ధి నమోదైంది. విదేశీ మారకద్రవ్యం 700 బిలియన్ డాలర్లను దాటేసింది. నేను కేవలం 125 రోజుల్లో జరిగిందే చెబుతున్నాను. ఈ కాలంలో భారత్‌లో ప్రపంచం మూడు విషయాలు చర్చించడానికి వచ్చి ంది. టెలికామ్-డిజిటల్ ఫ్యూచర్‌పై అంతర్జాతీయ అసెంబ్లీ జరిగింది. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్ నిర్వహించారు. గ్లోబల్ సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌పై సదస్సు జరిగింది. ఇవి భారత్ దిశ.. ప్రపంచం ఆశను తెలియజేస్తున్నాయి. ప్రపంచ భవిష్యత్తును భారత్ నిర్ణయిస్తుంది. మా ప్రభుత్వ మూడో విడత పాలనతో రేటింగ్ ఏజెన్సీలు దేశ వృద్ధిరేటును గణనీయంగా పెంచాయి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న దేశమని ప్రధాని మోదీ అభివర్ణించారు. పేదల కష్టాలు తమకు బాగా తెలుసన్నారు. ఈ కార్యక్రమానికి ముందు ఆయన సదస్సులో పాల్గొనడానికి వచ్చిన విదేశీ అతి థులను కలుసుకొన్నారు. రెండ్రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో యూకే మాజీ ప్రధాని డేవిడ్ కామరూన్, భూటాన్ ప్రధాని దాసో త్సేరింగ్ టోబ్గే, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ మిత్తల్ తదితరులు పాల్గొననున్నారు..

# పొరుగు రాష్ట్రాలకు ఇసుకను తరలించకుండా చర్యలు

(మొదటిపేజీ తరువాయి)



పెంచేందుకు సీనరేజి రద్దు చేసినట్లు సీఎం పురుద్ఘాటించారు.చెన్నై, హైదరాబాద్, బెంగళూరు మార్గాల్లో తరలింపు అధికంగా జరుగుతోందని, ఆయా మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ఠ పర్యవేక్షణ ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానంపై సీఎం సమీక్ష నిర్వహిం చారు.ఉచిత ఇసుక విధానం నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధి కారులను ఆదేశిం చారు. అక్రమ ఇసుక తవ్వకాలపై సామాన్యులు కూడా ఫిర్యాదు చేసేలా సరికొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. "గ్రామ పంచాయతీల పరిధిలో సొంత అవసరాలకు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిం పునకు అనుమతిచ్చాం. ఇసుక తీసుకెళ్లేవారు గ్రామ, వార్డు సచివాల యా ల్లో నమోదు చేయించాలి. రీచ్‌లలో తవ్వకాలు, లోడింగ్ ప్రైవేటుకు అప్పగింతపై ఆలోచించాలి" చంద్ర బాబు దిశానిర్దేశం చేశారు.

# గ్రూప్-1 పరీక్షల్లో జోక్యం చేసుకోలేం..

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తన మధ్యంతర ఉత్తర్వుల్లో అన్ని అంశాలూ స్పష్టంగా చెప్పిందని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లో ఉన్నప్పుడు జోక్యం చేసుకోవడం సరికాదని పేర్కొంది. ఫలితాల విడు దలకు ముందే తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తీర్పు వచ్చే వరకు పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ని రద్దు చేయాలని గ్రూప్-1 అభ్యర్థులు కోరుతున్నారు. జనరల్ కేటగిరీలోని అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిని అన్‌రిజర్వ్డుగానే పరిగణిస్తుండటం వల్ల దివ్యాంగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. వారికంటే ఎక్కువ మార్కులు వచ్చినా.. రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్స్‌కు పిలవాలని కోరుతున్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షలు నిలిపివేయాలని కొందరు అభ్యర్థులు కోరగా.. హైకోర్టు నిరాకరించింది. నోటిఫికేషన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించిన ఉన్నత న్యాయస్థానం.. నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని విచారణ వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో సోమవారం నుంచి జరగాల్సిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు లైన్ క్లియర్ అయింది. మరికొద్ది గంటల్లో పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ప్రస్తుత దశలో పరీక్షల నిర్వహణలో తాము జోక్యం చేసుకోలేమని తెలిపింది. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది.

# పోలీసుల త్యాగాలు ఎనలేనివి

(మొదటిపేజీ తరువాయి)

అనిత, ఏపీ డీజీపీ ద్వారక తిరుమలరావు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. విధి నిర్వహణలో చాలా మంది పోలీసులు ప్రాణాలు విడిచి ప్రజల హృదయాల్లో త్యాగ ధనులుగా నిలి చారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అన్నింటికంటే పోలీసు శాఖ అత్యంత కీలకమని చెప్పారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. 'ఏ ప్రగతి జరగాలన్నా పోలీ సులే కీలకం. ప్రజల ప్రాణాలు, ఆస్తులు కాపాడేందుకు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఉమ్మడి రాష్ట్రంలో నక్సలిజాన్ని ఉక్కుపాదంతో అణచివేశారు. ఫ్యాక్షనిజం, రౌడీల ఆట కట్టిం చారు. శాంతిభద్రతలను కాపాడటంలో ఏమాత్రం రాజీలేదు. పోలీసుల సంక్షేమం మా ప్రభుత్వం బాధ్యత. పటిష్ఠ యంత్రా ంగంగా తయారు చేయడం మా కర్తవ్యం. రాష్ట్ర విభజన తర్వాత పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చాం. వాహ నాలతో పాటు పరికరాలు, సాంకేతిక సౌకర్యం కల్పించాం. ఏపీ పోలీసు అంటే దేశంలోనే మోడల్‌గా తీర్చిదిద్దాలని ముం దుకెళ్లాం. 2014-2019 మధ్య రూ.600 కోట్లు ఖర్చు చేశాం. కొత్తగా వాహనాల కోసం రూ.150కోట్లు వెచ్చించాం. పోలీసు కార్యాలయాల మరమ్మతులు, నిర్వహణకు రూ.60కోట్లు ఖర్చుపెట్టాం. రూ.27కోట్లతో ఏపీఎఫ్ఎస్ఎల్ ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేశాం. పోలీసు సంక్షేమానికి రూ.55 కోట్లు కేటాయించాం. సర్వే రాళ్లపై బొమ్మలకు తగలేసి.. సీసీ కెమెరాలకు రూ.700కోట్లు ఇవ్వలేకపోయారు..సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు దీటైన పోలీసు వ్యవస్థకు శ్రీకారం చుట్టాం. విశాఖ పట్నంలో గ్రేహౌండ్స్ కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశాం. కేంద్రం ఎప్పటికప్పుడు పోలీసు వ్యవస్థ ప్రక్షాళనకు ముందు కొస్తోంది. ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అది ,కారంలోకి వచ్చిన 125 రోజుల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ చెల్లించాం. దిశ పేరుతో వాహనాలకు రూ.16కోట్లు, కమ్యూ నికేషన్ పరికరాల కోసం రూ.20కోట్లు పెండింగ్ పెడితే వాటినీ చెల్లించాం. తప్పు చేసిన వ్యక్తిని వెంటనే పట్టుకునే వ్యవస్థ అవసరం. గత ప్రభు త్వం కక్ష సాధింపులే పనిగా పెట్టుకుంది. రాగద్వేషాలకు అతీతంగా పనిచేసేదే పోలీసు వ్యవస్థ.



సర్వే రాళ్లపై బొమ్మ కోసం రూ.700 కోట్లు తగలేసిన వ్యక్తి జగన్. సీసీ కెమెరాల కోసం మాత్రం రూ.700 కోట్లు ఇవ్వలేక పోయారు. నేరాల తీరు మారుతోంది.. పోలీసు వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలి. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవా రిని కఠినంగా శిక్షించాలి' అని చంద్రబాబు సూచించారు. దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన పోలీసులకు నివాళులు అర్పిస్తున్నా. శాంతిభద్రతల కోసం వారు అహర్నిశలు కృషి చేస్తున్నారు. సంఘ విద్రోహ శక్తులపై పోరాడిన ఉమేశ్ చంద్ర, వేదవ్యాస్ లాంటి పోలీసులు ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అలాంటి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది. వారి స్ఫూర్తి ప్రతి పోలీసులో ఉంది. దేశానికి, రాష్ట్రానికి ఈ శాఖ చాలా కీలకం. రాత్రి, పగలు తేడా లేకుండా పని చేస్తారు. పోలీసు ఉద్యోగం సవాళ్లతో కూడుకుంది. 24 గంటలూ పని చేసే ఏకైక శాఖ పోలీసు శాఖ. వారికి పండగలు ఉండవు, ఎప్పుడూ విధుల్లోనే ఉంటారు. తిరుమల బ్రహ్మోత్సవాలు, దుర్గమాత ఉత్సవాలు, విజయవాడ విపత్తులో పోలీసుల పాత్ర అభినందనీయం. భారతదేశంలోనే ఏపీ పోలీసు వ్యవస్థ ఒక బ్రాండ్ అయిపోయిందన్నారు. ఆడబిడ్డలపై అత్యాచారాలు చేస్తున్నారు. ప్రతి కేసును సవాల్‌గా తీసుకుంటాం.. ఛేదిస్తాం. ఆడబిడ్డలు ట్రాప్‌లో పడొద్దు. నేరస్థులకు చట్టపరమైన శిక్షపడేలా ప్రభుత్వం చర్య తీసుకుంటుంది. పిల్లలను తల్లిదండ్రులు కంట్రోల్ చేయాలి. హిందూపూర్ గ్యాంగ్ రేప్, కడపలో యువతి హత్య కేసులో నేరస్థులకు కఠిన శిక్షలు పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది . ఆడబిడ్డల రక్షణే ప్రభుత్వ లక్ష్యం. రానున్న రోజుల్లో కానిస్టేబుల్ నియామకాలు చేపడతాం. ప్రతి ఏటా రూ.20 కోట్లు పోలీసు శాఖకు అందిస్తాం. రానున్న రోజుల్లో అమరావతిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుపుకుందాం. అమరావతిలో శాశ్వత అమరవీరుల సంస్మరణ స్థూపం ఏర్పాటు చేస్తానని అన్నారు. రాయలసీమ ఫ్యాక్షనిజం, విజయవాడ రౌడీయిజం అణచివేసిందే పోలీసులే. ఇకపై రాష్ట్రంలో జీరో క్రైమ్ నమోదు కావాలి. శాంతి, భద్రతలు మొదటి ప్రాధాన్యతగా పనిచేయాలి. ఎవరైనా నేరం చేయాలనే ఆలోచన వస్తేనే భయపడాలి. పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చాం. వారికి కావాల్సిన సదుపాయాలు అన్నీ సమకూర్చాం. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. సవాళ్లను ఎదుర్కొనేందుకు సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేశాం. నేను మొదట్నుంచీ పోలీసు వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టా. సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసులకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. నేరస్థులు లేటెస్ట్ టెక్నాలజీ వాడుతుంటే పోలీసులు పాత టెక్నాలజీ వాడుతున్నారు. ప్రభుత్వం పోలీస్ వ్యవస్థపై దృష్టి పెడుతోంది. ఇకపై టెక్నాలజీ పరిజ్ఞానం అందిస్తాం. ఆధునిక పరికరాలు సమకూరుస్తాం అన్నారు. నేటి సమాజంలో నేరాల తీరు మారుతోంది. నేరస్థుల కంటే పోలీసులు ఎక్కువ టెక్నాలజీ కలిగి ఉంటేనే వారిని కట్టడి చేయగలం. రాజకీయ నాయకుల ముసుగులో కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారు. వారి రాజకీయ ముసుగు తీసి నేరాలు అరికట్టే బాధ్యత పోలీసులు తీసుకోవాలి. మీకు అండగా ప్రభుత్వం ఉంటుంది. భావితరాల కోసం నేను గతంలోనే టెక్నాలజీ తీసుకువచ్చాను. రియల్ టైమ్ మానిటరింగ్ చేయగలిగితే నేరాలు నియంత్రించవచ్చు. మూడో నేత్రానికి నాలుగో నేస్తం సాంకేతిక పరిజ్ఞానం. రౌడీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే అదే వారికి చివరిరోజు. డ్రగ్స్, గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట వేస్తాం. గత ప్రభుత్వ పెండింగ్ నిధులు విడుదల చేశాం. నేను కోరుకునేది విజుబుల్ పోలీసింగ్... ఇన్విజిబుల్ పోలీసింగ్. రాజకీయ వేధింపులకు పోలీసులను వైసీపీ ప్రభుత్వం వాడుకుంది. రూ.12 కోట్లతో కంచె ఏర్పాటు చేసుకున్నాడు గత ముఖ్యమంత్రి. మాజీ సీఎం జగన్ సర్వే రాళ్లపై రూ.700 కోట్లు వృథా ఖర్చు చేశారు. గత ప్రభుత్వం పోలీసులకు సరెండర్ లీవ్స్ కూడా ఇవ్వకపోవడం బాధాకరం. వారు చేసిన అప్పులు తీర్చే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వంపై పడిందని బాబు చెప్పారు.

# డయేరియా బాధితులను ఆదుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

వ్యాప్తి కారణాలపై కలెక్టర్‌తో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. విచారణ తర్వాత ప్రభుత్వం నుంచి పరిహారం ప్రకటిస్తామన్న ఆయన.. వ్యక్తిగతంగా మృతుల కుటుంబాలకు రూ. 1లక్ష ఆర్థిక సాయం ప్రకటించారు." గత ప్రభుత్వ తప్పిదాలు మాకు వారసత్వంగా వచ్చాయి. గుర్లకు వెళ్లే చంపావతి నీరే కలుషితమైంది. గత ప్రభుత్వం కనీసం మంచినీరు అందించలేకపోయింది. విచారణకు సీనియర్ ఐఏఎస్ విజయానంద్‌ను నియమించారు. విచారణ తర్వాత ప్రభుత్వం నుంచి పరిహారం ప్రకటిస్తాం. మృతుల కుటుంబాలకు వ్యక్తిగతంగా రూ.1లక్ష సాయం ప్రకటిస్తున్నా" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆకస్మికంగా రుషికొండపై పర్యటించారు. విజయనగరం జిల్లా పర్యటనను ముగించుకొని తిరుగు ప్రయాణంలో రుషి కొండకు వెళ్లిన పవన్.. పర్యాటక శాఖ భవనాలను పరిశీలించారు. ఆయన వెంటన జనసేన నేతలు ఎంపీ భరత్, ఎమ్మెల్యే విజయ్ కుమార్ ఉన్నారు.



# కెనడా తీరుపై అసహనం

**న్యూఢిల్లీ,అక్టోబరు 21 :** భారత దౌత్యవేత్తలపై కెనడా ప్రభుత్వ చర్యలతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణించిన క్రమంలో..తాజా పరిణామాలపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పందించారు. పోలీసు విచారణలో భారత హైకమిషనర్ పాల్గొనాలని కెనడా కోరిందని.. అందుకే మన హైకమిషనర్‌తో పాటు దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించామని చెప్పారు. ఓ జాతీయ వార్తా ఛానెల్ నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన.. ఆ దేశంతో సంబంధాలను ప్రస్తుతం అంచనా వేయడం కష్టమేనన్నారు. 'పోలీసు విచారణలో భారత హైకమిషనర్ పాల్గొనాలని కెనడా కోరింది. అందుకే మన హైకమిషనర్‌తోపాటు దౌత్యవేత్తలను ఉపసంహ రించుకోవడాన్ని ఎంచుకున్నాం. దౌత్యవేత్తల సంక్షేమం, భద్రతకు సంబంధించి కెనడాలో ఏం జరుగుతుందనే విషయాలను తెలుసుకోవడం కెనడాకు ఇబ్బంది కరంగా మారినట్లు కనిపిస్తోంది. అదే భారత్‌లో.. కెనడా దౌత్యవేత్తలు మాత్రం మన సైన్యం, పోలీసుల సమాచారాన్ని స్వేచ్ఛగా సేకరించడం, నిర్దేశిత పౌరులను కెనడాలో అడ్డుకునేందుకు మాత్రం ఎటువంటి చర్యలుండవు ' అని కెనడా తీరుపై జైశంకర్ మండిపడ్డారు. 'అక్కడా, ఇక్కడా వారి తీరు భిన్నంగా ఉంది. భారత్‌కు చెందిన నేతలు, దౌత్యవేత్తలను మీ పౌరులు బహిరంగంగా బెదిరిస్తున్నారు అని మనం చెబితే.. వాక్ స్వాతంత్ర్యం అంటారు. భారత హైకమిషనర్‌ను బెదిరించినా భావ ప్రక టనా స్వేచ్ఛ కింద పరిగణించాలని అంటున్నారు. అదే భారత్‌లోని కెనడా దౌత్యవేత్త సౌత్‌బ్లాక్ నుంచి కోపంతో బయటకు వచ్చారని ఓ భారత జర్నలిస్టు పేర్కొంటే మాత్రం.. విదేశీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. వారి దేశంలో ఒక మాదిరిగా వ్యవహరిస్తాం. విదేశాల్లో అవి మీకు వర్తించవు అని అంటున్నారు. ఇదీ మారుతున్న ప్రపంచంలో చోటుచేసుకుంటున్న పరిస్థితులు' అని కెనడాను ఉద్దేశిస్తూ భారత విదేశాంగ మంత్రి చురకలు అంటించారు. 1945 తర్వాత ప్రపంచంపై పాశ్చాత్య దేశాల ప్రభావం ఎక్కువగా ఉండేదన్న జైశంకర్.. గడిచిన 20-25 ఏళ్లలో పరిస్థితుల్లో మార్పు వచ్చిందన్నారు. పాశ్చాత్యేతర దేశాల వాటా, భాగస్వామ్యం, ప్రభావం పెరిగిందని.. ఈ నేపథ్యంలో వివాదాలు, ఘర్షణలు, వాదనలు సహజమేనన్నారు.

# విమానయాన భద్రతే ముఖ్యం..

**న్యూఢిల్లీ,అక్టోబరు 21 :** విమానయాన భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజ రాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. బెదిరింపులకు పాల్పడేవారిని నో ఫ్లై జాబితాలో చేర్చేలా చట్టాలను సవరిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటి వరకు వచ్చిన బెదిరింపులు మొత్తం బూటకమని తేలిందన్నారు. పౌర విమానయాన శాఖకు కఠినమైన ప్రొటోకాల్ ఉందని.. దానినే తమ శాఖ, విమానయాన సంస్థలు అనుసరిస్తోందని వివరించారు. ఇలాంటి బెదిరింపులు వచ్చిన సమయంలో పరిస్థితి చాలా సున్నితంగా ఉంటుందన్నారు. అంతర్జాతీయ విధివిధానాలను మనం అనుసరించాలని ఆయన వ్యాఖ్యానించారు. బెదిరింపు కాల్స్, సోషల్ మీడియా పోస్టులకు పాల్పడేవారికి జీవిత ఖైదు విధించేలా చట్టపరమైన మార్పులు తెచ్చేందుకు యత్నిస్తున్నామన్నారు. విమానంలో బోర్డింగ్ అయ్యాక బెదిరింపులకు పాల్పడేవారికి ఇటువంటి శిక్ష విధించేలా ఇప్పటికే చట్టంలో సెక్షన్లు ఉన్నాయి. కానీ, ఇతర ప్రాంతాల్లో ఉంటూ బెదిరింపులకు పాల్పడేవారికి కూడా వీటిని వర్తింపజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిలో ఉగ్రకోణంపై స్పందించేందుకు కేంద్ర మంత్రి నిరాకరించారు. అక్టోబర్ 14 నుంచి పలు విమానాలకు దాదాపు 100 బెదిరింపులు వచ్చాయి. ఈ అంశంపై పలు వర్గాలతో సమావేశాలు నిర్వహించినట్లు రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానయాన భద్రతా నిబంధనల సవరణ అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. 1982 సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ చట్టాన్ని సవరించే అంశంపై వివిధ శాఖలతో కూడా చర్చిస్తున్నట్లు వివరించారు. 'గత వారం పలు విమానాలకు బెదిరింపులు రావడంతో వేరే మార్గాలకు మళ్లించాము. ప్రతి దానిని ప్రత్యేకంగా విశ్లేషించి వేగంగా, సమర్థవంతంగా చర్యలు తీసుకొన్నాం. అవి తప్పుడు బెదిరింపులైనా.. భద్రత, సురక్షిత విషయంలో రాజీ పడటంలేదు. ప్రయాణికుల ప్రాణాలే మాకు ముఖ్యం. అదే సమయంలో ఒక్క విమానాన్నైనా దారి మళ్లించాలనో, జాప్యం చేయాలనో మేము అనుకోవడం లేదు. హోంశాఖ, ఇతర ఏజెన్సీలతో కలిసి వీటిపై దర్యాప్తును వేగవంతం చేస్తున్నాం. రానున్న రోజుల్లో మెరుగైన పరిస్థితిని చూస్తాం' అని కేంద్ర మంత్రి చెప్పారు. శనివారం ఒక్కరోజే 30కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు రాగా.. ఆదివారం సైతం 24 విమానాలకు వచ్చాయి. ఇండిగో, విస్తారా, ఎయిరిండియా, ఆకాశ ఎయిర్‌తోపాటు పలు అంతర్జాతీయ సర్వీసు విమానాలు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఇండిగో, విస్తారా, ఎయిరిండియాకు చెందిన విమానాలు ఆరు చొప్పున ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ బెదిరింపుల గురించి సంబంధిత అధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు భద్రతా విధానాలను పాటిస్తున్నామని విమానయాన సంస్థల ప్రతినిధులు వెల్లడించారు. ఈ వారంలో 90కిపైగా విమానాలకు బాంబు బెదిరింపులు రాగా, అవన్నీ నకిలీవేనని అధికారులు తేల్చారు.

# నంద్యాల పిటిషన్ కొట్టివేయండి

**అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రపత్రిక):** ఏపీ హైకోర్టులో సినీనటుడు అల్లు అర్జున్ పిటిషన్ దా ఖలు చేశారు. ఎన్నికల సమయంలో నంద్యాలలో తనపై నమోదైన కేసును క్వాష్ చేయాలని ఆయన కోరా రు. సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉండగా అనుమతి లేకుండా జనసమీకరణ చేపట్టారంటూ అల్లు అర్జున్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఎన్నికల సమయంలో నంద్యాలలో పర్యటించిన అల్లు అర్జున్ పై ఈసీ ఆదేశాల మేరకు కేసు నమోదు అయింది. ఆ కేసును కొట్టి వేయాలంటూ అల్లు అర్జున్ ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాను ఎన్నికల ప్రచారం కోసం వెళ్లలేదని తన స్నేహితుడ్ని కలవడానికి మాత్రమే వెళ్లానని ఆయన అంటున్నారు. ఏపీలో ఎన్నికల ప్రచారం చివరి దశకు వచ్చిన సమయంలో అల్లు అర్జున్ తన స్నేహితుడు అయిన నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రారెడ్డికి మద్దతుగా నంద్యాలలోని ఆయన ఇంటికి వెళ్లారు. ఎక్కడా ఎన్నికల ప్రచారం చేయలేదు కానీ ఆయన ఇంటి వద్దకు పెద్ద ఎత్తున అభిమానులుతరలి వచ్చారు. నంద్యాల నుంచి పోటీ చేస్తున్న తన మిత్రుడు వైసీపీ అభ్యర్థి శిల్పా రవిని గెలిపించాలని.. ఆయనకు మద్దతుగానే వచ్చానని మీ డియాకు చెప్పారు. భారీ సంఖ్యలో జనం రావడంతో ఎన్నికల సంఘం దాన్ని ఎన్నికల ప్రచారంలో భాగంగానే పరిగణించింది. అనుమతి లేకుండా జన సమీకరణ చేశారని స్థానిక ఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవి, అల్లు అర్జున్ పై ఎన్నికల నిబంధనల ప్రకారం కేసు నమోదు చేశారు. ఓ వైపు మెగా ఫ్యామిలీ మొత్తం పవన్ కల్యాణ్‌కు మద్దతుగా పిఠాపురం వెళ్తూంటే.. అల్లు అర్జున్ మాత్రం భిన్నంగా వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శిల్పా రవిచంద్రారెడ్డికి మద్దతుగా వెళ్లడం కూడా వివాదాస్పదమయింది. అయితే తన స్నేహితుల కోసం తాను ఎక్కడికైనా వెళ్తానని ఆయన ప్రకటించారు. ఈ కారణంగా మెగా కుటుంబంలో విబేధాలు కూడా వచ్చాయన్న ప్రచారం జరిగింది. ఎన్నికల సమయంలో నమోదు చేసిన కేసు కావడంతో కోర్టులో ఊరట దక్కే అవకాశాలు తక్కువేనని ఎన్నికల కేసుల నిపుణులు అంచనా వేస్తున్నారు. పోలీసులు అన్నీ పరిశీలించి కేసు నమోదు చేసి ఉంటారు కాబట్టి విచారణ ఎదుర్కోవాలని చెప్పే అవకాశం ఉందని అంటు న్నారు. పోలీసులు వేసే కౌంటర్‌ను బట్టి ఈ పిటిషన్ మెరిట్స్ ఉంటాయని అనుకోవచ్చు. అల్లు అర్జున్ ప్రచారం చేసినప్పటికీ నంద్యాల వైసీపి అభ్యర్థి శిల్పా రవిచంద్రారెడ్డి ఘోరపరాజయం పాలయ్యారు. వ్యక్తిగతంగా రాజకీయాలకు దూరంగా ఉండే అల్లు అర్జున్ స్నేహితుల్లో రాజకీయ నేతలు ఎక్కువగా ఉంటారు.

## రాష్ట్ర అభివృద్ధిలోనూ పోలీసులదే
# కీలక బాధ్యత
### అమరపోలీసులకు నివాళి అర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక):** శాంతి భద్రతలు, నిఘా విషయంలో తెలంగాణ పోలీసుల పాత్ర కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేని దన్నారు. అమరులైన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. విధి నిర్వహ ణలో మరణించిన అధికారులను గుర్తు చేసు కోవడం అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. అమరులైన కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో అసువులుబాసి అమరులైన పోలీసులకు సీఎం నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ ప్రసంగిస్తూ.. అమరులైన పోలీస్ అధికారులందరికీ ప్రభుత్వం తరపున ఘన నివాళులర్పించారు. 140 కోట్ల దేశ జనాభా ప్రశాంతంగా ఉంటున్నారంటే అందుకు పోలీసులే కారణమన్నారు. రాష్ట్రం అభివృద్ధి పదంవైపు నడవాలంటే పోలీసులు కీలకమన్నారు. నిరుద్యోగుల సమస్య, శాంతి భద్రత లేని రాష్ట్రం ఉంటే పెట్టుబడులు రావని.. రాష్ట్రం అభివృద్ధికి పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. అమరులైన పోలీస్ అధికారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. అమరులైన ఎస్సై, సీఐ కుటుంబాలకు రూ.కోటి 25 లక్షలు.. డీఎస్పీ, ఏఎస్పీ కుటుంబాలకు రూ.కోటి 50 లక్షలు.. ఎస్పీ, ఐపీఎస్ కుటుంబాలకు రూ.2 కోట్ల పరిహారం ఇస్తామన్నారు. శాశ్వత అంగవైకల్యం పొందిన పోలీసులకు పరిహారం ఇస్తామని ప్రకటించారు.'పోలీసు సిబ్బంది పట్ల నాకు ప్రత్యేక అభిమానం ఉంది. పోలీసులు, వారి కుటుంబాలు ఆత్మగౌరవంతో జీవించాలి. ఎవరి ముందో చేయి చాచే పరిస్థితి తెచ్చుకోవ ద్దని కోరుతున్నానని అన్నారు. విమర్శలకు అవకాశం ఇవ్వొద్దని కోరుతున్నా. విధి నిర్వహణలో పోలీసులకు ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటాం. వారి ఖర్చులు, ఇతర ఏర్పాట్లకు నిధులు కేటాయిస్తాం. నేరగాళ్లు సరికొత్త విధానాలతో ముందుకొస్తున్నారు. పెరుగుతున్న ఆధునిక సాంకేతికత ద్వారా నేరాలు చేస్తున్నారని హెచ్చరించారు. తెలంగాణ పోలీసుల విధానాలను ఇతర రాష్ట్రాలు పాటిస్తున్నాయి.

## ఎయిరిండియా విమానాల్లో
# ప్రయాణించవద్దు

(మొదటిపేజీ తరువాయి)

తేదీల మధ్యలో ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దని అతడు వార్నింగ్ ఇవ్వడం గమనార్హం. భారత్‌లో సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏళ్లు కావొస్తున్న సందర్భంగా ఎయిర్ ఇండియా విమానాలపై దాడి జరిగే అవకాశం ఉందని పన్నూ అన్నాడు. అందులో ఆయా తేదీల్లో ఆ సంస్థ విమానాల్లో ప్రయాణించొద్దంటూ ఓ వీడియో సందేశంలో పేర్కొన్నాడు. కాగా.. ఇలాంటి హెచ్చరికలు చేయడం ఇది తొలి సారి కాదు. గత నవంబరులోనూ ఇలాంటి వీడి యో విడుదల చేశాడు. నవంబరు 19న దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఆ రోజు మూతపడుతుందని, దాని పేరు కూడా మార్చేస్తామని గతేడాది అతడు ఓ వీడియోలో హెచ్చరించాడు. సిఖ్స్ ఫర్ జస్టిస్ అనే వేర్పా టువాద సంస్థను 2007లో స్థాపించగా.. వ్యవస్థా పకుల్లో గురుపత్వంత్ సింగ్ పన్నూ కూడా ఒకడు. ఈ సంస్థను భారత్ 2019లోనే నిషేధిం చింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం కింద భారత ప్రభుత్వం అతడిని 2020లో ఉగ్రవాదిగా ప్రకటించింది. ప్రస్తుతం అతడు అమెరికాలో ఉన్నట్లు సమాచారం. పన్నూకు అగ్రరాజ్యంతో పాటు కెనడా పౌరసత్వం కూడా ఉంది.












విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో పోలీసు సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు అమరవీరులకు నివాళులర్పించిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. రాష్ట్ర హోం మినిష్టర్ అనిత.. డిజిపి ద్వారక తిరులమలరావు ఏపీ సీఎస్ నీరబ్ కుమార్...

ఆంధ్రపత్రిక ఫొటోలు: సిహెచ్.విజయభాస్కర్









# కేంద్రమంత్రితో మంత్రి లోకేశ్ భేటీ

- రాష్ట్రంలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పన
- దేశంలోనే తొలిసారిగా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రణాళిక
- అధికారులతో మంత్రి నారాయణ చర్చలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్మెంట్ ప్రణాళికలు, దేశంలోనే మొదటిసారిగా జరుగుతున్న స్కిల్ సెన్సస్‌కి సహకారం అందించాలని కేంద్ర మంత్రి, సెంట్రల్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఆంతప్రెన్యూర్‌షిప్ అధికారు లను ఏపీ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. ఢిల్లీలోని కౌశల్ భవన్‌లో స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఆంతప్రెన్యూర్‌షిప్ శాఖ కేంద్రమంత్రి జయంత్ చౌధురి, సెక్రటరీ అతుల్ కుమార్ తివారీ, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సీఈవో వేద్ మణి తివారీలతో ఏపీ మంత్రి నారా లోకేష్, ఉన్నతాధికారులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో చేపట్టనున్న స్కిల్ సెన్సస్‌పై మంత్రి లోకేష్ స్పెషల్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. స్కిల్ సెన్సస్ లక్ష్యం, ఎలా చేపడుతున్నారని కేంద్రమంత్రి ఆరా తీశారు.కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో లక్షలాది ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యంగా స్కిల్ డెవలప్మెంట్, స్కిల్ సెన్సస్ చేపట్టిందని మంత్రి తెలిపారు. మంత్రి నారా లోకేష్‌తోపాటు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరా మరాజు, ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవో గణేష్ కుమార్, ఈడీ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

# 31 నుంచి ఉచిత సిలిండర్ల పంపిణీ

## ఎపి మహిళలకు చంద్రబాబు దీపావళి కానుక
## ఏడాదికి మూడు సిలిండర్లు ఇచ్చేందుకు నిర్ణయం



**అమరావతి, అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక):** ఏపీలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి ఉచితంగా ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. దీపం పథకం కింద ఈ ఉచిత గ్యాస్ సిలిండర్లను మహిళలకు అందిస్తామని తెలిపారు. దీనికోసం ఏడాదికి రూ.2948 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీపం పథకం అమలు, విధివిధానాలపై ఏపీ సీఎం చంద్రబాబు సోమవారం సమీక్ష నిర్వమించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. మహిళల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అందుకే రాష్ట్రంలో ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ.. పేదలకు మేలు చేసే సంక్షేమ పథకాల విషయంలో ముందడుగు వేస్తున్నామని తెలిపారు. ఈ నెల 31వ తేదీ నుంచి దీపావళి పథకం ప్రారంభించాలని నిర్ణయిం చినట్లు తెలిపారు. ఈ పథకం కింద ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ కలిగి ఉండి.. అన్ని అర్హతలు కలిగిన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని పేర్కొన్నారు. ప్రతి నాలుగు నెలల వ్యవధిలో ఎప్పుడైనా ఆయా లబ్దిదారులు ఒక ఉచిత గ్యాస్ సిలిండర్ పొందే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఈ క్రమంలో ఈ నెల 24 నుంచి సిలిండర్ కోసం బుకింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

# వాలంటీర్ హత్యపై మంత్రి స్పందన

## పినిపె విశ్వరూప్ వ్యాఖ్యలను ఖండించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**కోనసీమ,అక్టోబరు 21 (ఆంధ్రపత్రిక):** దళిత యువకుడు, వాలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో వైకాపా నేత, మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్‌ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ అరెస్టు వెనక తన ప్రోద్బలం లేదని మంత్రి వాసంశెట్టి సుభాష్ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. మాజీ మంత్రి, అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు విశ్వరూప్ చేసిన వ్యాఖ్యలను మంత్రి సుభాష్ ఖండించారు. "విశ్వరూప్ కుమారుడి విషయంలో చట్టం తన పని తాను చేసుకు వెళుతుంది. ఎస్ఆర్సీపీ ప్రభుత్వంలో వాలంటీర్ దుర్గాప్రసాద్ హత్య కేసు మూసేశారు. కేసు పెట్టకుండా దుర్గాప్రసాద్ భార్యకు మాజీ మంత్రి విశ్వరూప్ రెండు ఎకరాలు ఇస్తానని ఇవ్వలేదు. న్యాయం చేయమని ఆమె నా వద్దకు వచ్చింది. బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకే నేను బాధితులను డీజీపీ, ఐజీల వద్దకు తీసుకెళ్లాను" అని అన్నారు. "శ్రీకాంత్‌కు వాలంటీర్ దుర్గాప్రసాద్ ప్రధాన అనుచరుడిగా ఉండేవాడు. తన కుమారుడికి శ్రీకాంత్ అని పేరు పెట్టుకున్నాడు. రాజకీయ కక్ష సాధింపులు వద్దని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టంగా చెబుతున్నారు. ఆ మాట ప్రకారం మేము నడుచుకుంటున్నాం. కోనసీమ అల్లర్ల కేసులో నేను ఏ1గా ఉన్నానని విశ్వరూప్ అవాస్తవాలు మాట్లాడారు. నా పేరును వైకాపా ప్రభుత్వం చేర్చింది" అని అన్నారు.



# 2025 జూన్ 12 నాటికి పోర్టు ప్రారంభిస్తాం

- మూలపోర్టు పనులు ప్రారంభించిన మంత్రి అచ్చెన్న

**శ్రీకాకుళం, అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక):** మూలపేట పోర్టు నిర్మాణ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు సోమవారం పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 2025 జూన్ 12 నాటికి పోర్టు నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదికి పోర్టు ప్రారంభిస్తామని చెప్పారు. శ్రీకాకుళం జిల్లాను పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేస్తామని చెప్పారు. మూలపేట పోర్టు ద్వారా శ్రీకాకుళం జిల్లా నుంచి ఎగుమతి అవకాశాలు వృద్ధి చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వలసలను నివారించి ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## తిరుమల లడ్డూ వ్యవహారం..

# పవన్‌కు నోటీసులు



**హైదరాబాద్, అక్టోబర్ 21 (ఆంధ్రపత్రిక):** తిరుమల శ్రీవారి లడ్డూలో ఉపయోగించే కల్తీ నెయ్యి అంశం ఇంకా కాకరేపుతూనే ఉంది. పంది కొవ్వు ఉపయోగించారని తెలిసి శ్రీవారి భక్తులు ఆందోళనకు గురయ్యారు. తిరుపతి లడ్డూపై రాజకీయ నేతలు, పలువురు ప్రముఖులు కామెంట్స్ చేశారు. ఆంధప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా స్పందించారు. గత పాలక మండలి కల్తీ నెయ్యి ఉపయోగించిందని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలతో చాలా మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఇదే అంశంపై హైదరాబాద్‌కు చెందిన అడ్వకేట్ ఇమ్మనేని రామారావు సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భక్తులకే కాదు.. అయోధ్యలో రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి కూడా తిరుపతి లడ్డూ పంపించారని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. పవన్ చేసిన కామెంట్లతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి. తిరుమల లడ్డూ తయారీ కోసం జంతువులు కొవ్వు కలిపారని అనడం దారుణం. ఆ ఆరోపణలకు సంబంధించి ఫొటోలు, వీడియోలను కోర్టు ముందు ఉంచాం. లడ్డూ గురించి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రసారం చేసిన యూట్యూబ్ చానెళ్ల నుంచి ఆ కామెంట్లను తొలగించాలి అని' పిటిషనర్ సిటీ సివిల్ కోర్టులో వేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. తిరుమల లడ్డూకు సంబంధించి ఇమ్మనేని రామారావు వేసిన పిటిషన్‌ను ధర్మాసనం విచారణకు స్వీకరించింది. వచ్చే నెల 22వ తేదీన కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాలని సమన్లు జారీచేసింది. ఈ అంశంపై పవన్ కళ్యాణ్ స్పందించాల్సి ఉంది.

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com